
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వనపర్తి
శనివారం 5, ఆగస్టు 2017, పేజీలు 20

# శంకరసముద్రం కుడి కాలువకు నీళ్లు వదలాలి



నీటికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే చిన్నారెడ్డి

- మంత్రి హరీశ్‌ రావు ఆదేశించినా ఫలితం శూన్యం
- ఎమ్మెల్యే జిల్లెల చిన్నారెడ్డి
- కృష్ణసముద్రంలోకి చేరే నీటికి పూజలు

20

## బీడీ కార్మికులందరికీ ఇళ్లు మంజూరు

- బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి బీడీ మజ్దూర్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసులు

19

# సబ్సిడర్

### సబ్సిడీ ఎత్తివేస్తోంది ఇలా...

గ్యాస్ సిలిండర్‌పై ప్రస్తుతం వినియోగదారులు రూ.582 చెల్లిస్తున్నారు. ఇందులో సబ్సిడీ రూపంలో వినియోగదారుడి బ్యాంకు ఖాతాలో రూ.88 జమ అవుతున్నాయి. కేంద్రం తాజా నిర్ణయంతో ప్రతినెలా సబ్సిడీ పై రూ.4 చొప్పున తగ్గించనుంది. అంటే ధరలు తగ్గిన సమయంలో కేంద్ర ప్రభుత్వం రాయితీ సొమ్మును తగ్గిస్తుందే తప్పా వినియోగదారుడి పై భారాన్ని తగ్గించడం లేదు. మొత్తానికి వచ్చే మార్చి నాటికి సబ్సిడీకి కేంద్రం మంగళం పాడనుంది.

- సబ్సిడీపై మెల్లమెల్లగా రాయితీ ఎత్తేస్తున్న ప్రభుత్వం
- పెట్రోలు, డీజిల్ ధరలు మెల్లమెల్లగా పైపైకి..
- రోజువారీ ధరల నిర్ధారణే కారణం
- గ్యాస్ సబ్సిడీ ఎత్తివేతపై వినియోగదారుల్లో ఆందోళన
- నెలకు రూ. 4 పెంచి, వచ్చే మార్చికల్లా పూర్తిగా ఎత్తివేత
- తాజాగా సబ్సిడీ సిలిండర్‌పై రూ. 2 పెంచిన కేంద్రం

సామాన్యుడిపై ధరల భారం పడనుంది. ప్రభుత్వం సబ్సిడీలను క్రమంగా ఎత్తివేస్తుండటంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. ముఖ్యంగా చమురు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు హేతుబద్ధంగా లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కట్టెల పొయ్యి లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ ధీమా వ్యక్తం చేస్తున్న క్రమంలో కేంద్రం తాజాగా తీసుకున్న నిర్ణయం అందుకు బ్రేకులు వేస్తుందని చెప్పవచ్చు. సబ్సిడీ వంటగ్యాస్ ధరను పెంచుతూ మెల్లమెల్లగా వచ్చే మార్చి నాటికి రాయితీని పూర్తిగా ఎత్తివేసేందుకు కేంద్ర పెట్రోలియం శాఖ నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, వనపర్తి

3



టీఎంయూ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అశ్వత్థామారెడ్డి



## టీఎంయూ కొత్త శకం సృష్టించింది

- 44 శాతం ఫిట్‌మెంట్ మా ఘనతే
- మరణించిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు
- ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామారెడ్డి

4

### ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

– సుశీందర్ రావు, డీఈవో



పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. నిబంధనలను ధిక్కరిస్తే చర్యలు తీసుకుంటాం. జీవో ప్రకారం అన్ని పాఠశాలల్లో అవగాహన కల్పించాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

- ప్రభుత్వ ఆదేశాలు భేఖాతర్
- విద్యార్థులకు తప్పని మోత
- నిబంధనలు గాలికి..
- ప్రైవేట్ యాజమాన్యాల నిర్లక్ష్యం

# మారని తీరు



విద్యార్థుల పుస్తకాల బరువు తగ్గాల్సిందేనని గత నెలలో విద్యాశాఖ స్పెషల్ సీఎస్ రంజివ్ ఆర్ ఆచార్య జీవో 22 జారీ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఆదేశాలు పంపారు. అయితే ఆ ఆదేశాలను ప్రైవేట్ పాఠశాలలు భేఖాతర్ చేస్తున్నాయి. ఏ ఒక్క పాఠశాలలో కూడా బ్యాగ్ బరువు తగ్గిన దాఖలాలు కన్పించడం లేదు. జిల్లా విద్యాశాఖాధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడంతో విద్యార్థులకు మోత తప్పడం లేదు.

- వనపర్తి విద్యావిభాగం

4


- వివరాలు లోపలి పేజీల్లో..




వనపర్తిలో వరలక్ష్మి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు

చిన్నారి

# చిన్నారుల నైపుణ్యం

- కాగితాలతోనే గాలిపటం, కొవ్వొత్తుల తయారీ
- ఉత్తరాల కోసం ప్రత్యేక పోస్టు బాక్సు
- నిజాయితీని నేర్పడం కోసం నిజాయితీ పెట్టె
- శారీరక ఉత్సాహం కోసం క్రీడలు
- డ్రాయింగ్‌లోనూ నైపుణ్యం
- నాగమ్మతండా విద్యార్థుల ప్రత్యేకత

**వనపర్తి వ్యవసాయం:** వనపర్తి మండలం నాగమ్మతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రత్యేకత చాటుతున్నారు. వారి ప్రత్యేకతలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం. ప్రతి నిత్యం విద్యార్థులు మానసిక ఉత్సాహం పొందడానికి క్రీడలు నిర్వహిస్తున్నారు. అయితే ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు కూడా నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. క్రీడలతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. కాగితంతో గాలి పటం, కొవ్వత్తులు, పడవ, రాకెట్, ఇతర బొమ్మలు తయారు చేయడం నేర్చుకుంటున్నారు. మట్టితో వినాయకుని విగ్రహాలు కూడా తయారు చేయడం నేర్చుకున్నారు. అంతే కాకుండా వారికి నిజాయితీ అలవరచడానికి పాఠశాలలో ప్రత్యేకంగా ఓ పెట్టెను తయారు చేసి దానికి నిజాయితీ పెట్టే అనే నామకరణం చేశారు. పాఠశాల తరగతి గదుల్లో, ఆవరణలో ఏవైనా వస్తువులు దొరికితే వాటికి తీసుకువచ్చి నిజాయితీ పెట్టేలో వేయాలి. తిరిగి దానికి పోగొట్టుకున్న విద్యార్థులకు అందజేస్తారు.

అలాగే ఉత్తరాలు రాయడం అలవాటు చేసుకున్నారు. దీనికోసం కూడా ప్రత్యేకంగా పోస్టుబాక్సు తయారు చేసి పాఠశాలలో ఉంచారు. ప్రతి విద్యార్థి ఉత్తరం రాసి పోస్టుబాక్సులో వేయాల్సి ఉంటుంది. డ్రాయింగ్‌లోనూ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. వివిధ రకాల పక్షులు, జంతువుల బొమ్మలతో పాటు చిన్నారుల చిత్రాలు కూడా వేస్తున్నారు. క్రమశిక్షణ అలవరుకున్నారు. భోజనం సమయంలో క్యూలో నిలబడి అన్నం పెట్టించుకోవడం, భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడగడం, ప్రార్థన చేయడం అలవాటు చేసుకున్నారు.

### మానసిక ఉత్సాహం కోసం క్రీడలు...

మానసింగా ఉత్సాహంగా ఉండటంకోసం క్రీడల్లో పాల్గొంటున్నారు. ప్రతి రోజు పాఠశాల ఆవరణలోనే కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్, స్కిప్పింగ్, రింగ్‌బాల్, షటిల్ ఆడుతుంటారు. దీనివల్ల విద్యార్థులు మానసికంగా ఉల్లాసంగా ఉండి చదువుపై కూడా దృష్టి పెడతారని ప్రధానోపాధ్యాయులు బాలరాజు చెబుతున్నారు. విద్యార్థినులకు స్టార్‌గర్ల్ కార్యక్రమం కూడా నిర్వహిస్తుంటారు.



పోస్టుబాక్సులో ఉత్తరం వేస్తున్న విద్యార్థిని



కాగితాలతో గాలి పటాలు తయారు చేస్తున్న దృశ్యం

### మట్టి వినాయకున్ని తయారు చేయడం నేర్చుకున్నాం

**- భూమిక, సాయిరాం, విద్యార్థులు**



ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మట్టి వినాయకుని విగ్రహాలు తయారు చేయడం నేర్చుకున్నాం. క్రమశిక్షణ కూడా అలవర్చుకున్నాం. అలాగే ఆరోగ్యం కోసం భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవడం తదితర వాటిని పాఠశాలలో నేర్చుకున్నాం.

### కాగితాలతో గాలిపటం..

**- తరుణ్, విద్యార్థి**



కాగితాలతో వివిధ రకాల గాలిపటంతో పాటు బొమ్మలు, రాకెట్, గాలిపటం తదితర వాటిని తయారు చేయడం నేర్చుకున్నాం. ఇంకా ఏదైనా నేర్చుకోవాలన్న ఆసక్తి కలుగుతుంది. వీటితో పాటు చదువుపై కూడా శ్రద్ధ చూపుతున్నాం.



తాను గీసిన బొమ్మను చూయిస్తున్న విద్యార్థి

# దినదినాభివృద్ధిలో.. కోటయ్య దర్గా

- ప్రతి ఏడాది రంజాన్ మరుసటి రోజు ఉర్సు
- వేలాదిగా భక్తుల సందర్శన
- ఇతర ప్రాంతాల నుంచి రాక

**వనపర్తి వ్యవసాయం:** వనపర్తి మండలం ఖాసీంనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎద్దులగేరిలో గల కోటయ్య దర్గా దినదినాభివృద్ధి చెందుతున్నది. గ్రామానికి చెందిన కోటయ్య అనే వ్యక్తి గురు మతం చేసేవారు. గ్రామంలోనివారే కాకుండా వనపర్తి, అచ్చంపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి ఆయనను దర్శించుకొని వెళ్తుండేవారు. అయితే 2006లో ఆయన సమాధి కావడంతో కుటుంబ సభ్యులు అక్కడే దర్గా నిర్మించారు. నాటి నుంచి నేటివరకు ప్రతి ఏడాది రంజాన్ మరుసటి రోజు దర్గాలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. అంతేకాకుండా అక్కడే ఉర్సు నిర్వహిస్తారు. చాలా మంది ప్రజలు దర్గా దగ్గరకు వచ్చి చాదర్, పూలు, నైవేద్యం సమర్పించి వెళ్తుంటారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులు ప్రతి ఏడాది ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ప్రతి సోమవారం, గురువారం దర్గా దగ్గరకు వెళ్లి పూలు, టెంకాయ, స్వీటు నైవేద్యంగా సమర్పించి వస్తుంటారు. ప్రస్తుతం కోటయ్య పెద్దకుమారుడు రాములు దర్గా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు.

ఆధ్యాత్మికం

### ఆయన మార్గంలోనే నడుస్తున్నాం


**- రాములు, కోటయ్య కుమారుడు, ఎద్దులగేరి**



మా నాన్న మార్గంలోనే ముగ్గురం అన్నదమ్ములం నడుస్తున్నాం. ఇప్పటికి ప్రతి గురువారం పూలు, టెంకాయ నైవేద్యంగా సమర్పిస్తుంటాం. దర్గాను దర్శించుకోవడానికి ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ప్రతి ఏడాది ఉర్సు చేయడం ఆనవాయితీ.



ఎద్దులగేరిలోని దర్గా



దర్గాలో కోటయ్య సమాధి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

# సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు

**● మహేష్, ఉద్యాన అధికారి**



**వనపర్తి వ్యవసాయం:** జిల్లాలోని రైతులకు సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు అందజేయనున్నట్లు ఉద్యాన అధికారి మహేష్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఉద్యాన రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

**జిల్లాలో మొత్తం ఎన్ని హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు జరుగుతుంది?**

జిల్లాలో మొత్తం 8 వేల 248 హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు జరుగుతుంది.

**ఏఏ పంటలు ఎన్ని హెక్టార్లలో సాగవుతోంది?**

2వేల 246 హెక్టార్లలో కూరగాయల సాగు జరుగుతుండగా, టమాటా 355 హెక్టార్లలో, వంగ 231హెక్టార్లలో, బెండ 154 హెక్టార్లలో, ఉల్లి 895 హెక్టార్లలో, పచ్చిమిర్చి 243 హెక్టార్లలో, ఎండుమిర్చి 782హెక్టార్లలో, కొత్తిమీర 25 హెక్టార్లలో, ఇతర కూరగాయలు 121హెక్టార్లలో సాగు జరుగుతున్నది.

**డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలపై సబ్సిడీ ఎలా ఉన్నాయి?**

ఒక యూనిట్ స్ప్రింక్లర్ల పరికరాల విలువ రూ. 17,880, 75శాతం రాయితీతో ఒక రైతుకు ఒక యూనిట్ అందిస్తున్నాం. రైతు తనవంతుగా రూ. 4,470 కట్టాల్సి ఉంటుంది. అలాగే డ్రిప్ పరికరాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీపై, బీసీ, ఓసిలోని చిన్న సన్న కారు రైతులకు 90 శాతం, ఓసీలోని పెద్దకారు రైతులకు 80 శాతం సబ్సిడీతో అందిస్తున్నాం.

**పాలిహౌస్‌పై సబ్సిడీ ఎంత ఉంది? ఇప్పటి వరకు ఎంత మంది రైతులకు ఇచ్చారు?**

ఇప్పటి వరకు జిల్లాలో ఐదుగురు రైతులకు పాలిహౌజ్‌లు ఇచ్చాం. వీటికి సంబంధించి ఎకరానికి 33 లక్షల 75వేలు ఖర్చు అవుతుంది. అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు 95 శాతం, మిగతా రైతులకు 75 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతున్నది. అయితే వీటిపై ఈ ఏడాది ప్రభుత్వం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు.

**పండ్ల తోటలకు రైతులకు ఎలాంటి ప్రోత్సాహం అందిస్తున్నారు?**

పండ్ల తోటల రైతులకు సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నాం. మామిడి, ఆపిల్‌బేర్, దానిమ్మ, జామ పండ్ల తోటల రైతులకు అత్యధికంగా 4 హెక్టార్ల వరకు 40 శాతం సబ్సిడీ ప్రభుత్వమే భరిస్తుంది.

## పాఠశాలల మూసివేతను

# నిలుపుదల చేయాలి

**● యేసేపు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, వనపర్తి**

లీడర్ వాయిస్



**వనపర్తి వ్యవసాయం:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల మూసివేతను నిలుపుదల చేయడంతో పాటు ఉపాధ్యాయులు హేతుబద్దీకరణను ఆపాలి. వనపర్తి జిల్లాలో 63 పాఠశాలలను మూసివేతకు గురవుతున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం ప్రథమంగా వసతులు కల్పించడంపై దృష్టి సారించాలి. రాష్ట్ర వ్యాప్తంగా 17వేల 332 పాఠశాలల్లో నీటి వసతి లేదు. 11వేల పాఠశాలల్లో వంట గదులు లేవు. 8వేల 140 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవు. 12వేల పాఠశాలలకు ఆట స్థలాలు లేవు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత చాలా ఉంది. 67 శాతం పాఠశాలలో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. 56 శాతం ప్రాథమిక పాఠశాలలకు రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఇలా ఉంటే ప్రభుత్వ పాఠశాలలు ఎలా బలోపేతం అవుతాయి. ప్రతి పాఠశాలలో ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టాలి. ప్రతి పాఠశాలను గురుకుల పాఠశాలగా మార్చాలి. కొన్ని ప్రాంతాల్లో గురుకుల పాఠశాలలకు విద్యార్థులు వెళ్లడం వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. అలాంటప్పుడు విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న పాఠశాలలను మూసివేయడం దారుణం. ఇలా చేస్తే పేద విద్యార్థులకు విద్య దూరమవుతుంది. ప్రభుత్వం విద్యను కార్పోరేట్ వారికి అప్పజెప్పాలని చూస్తున్నది. ఇందులో భాగంగా ప్రైవేటు విద్యాసంస్థలు ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా కామన్‌స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి.

# దేవాలయ భూములను పరిరక్షించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి

**చిన్నంబావి:** జిల్లాలో హిందూ దేవాలయాలలో దూపదీప నైవేద్యాలను కల్పించాలని, ప్రాచీన చరిత్ర కలిగిన దేవాలయాలలో వసతులు కల్పించి దేవాలయాల భూములను పరిరక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నంబావి మండల చిన్నమారూర్ గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామంలో ఉండే వివిధ దేవాలయాల గురించి తెలుసుకున్నారు. గ్రామంలో శివాలయం, చెన్నకేశవస్వామి, తిమ్మప్ప గ్రామ ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నమారూర్ గ్రామంలో సుమారు 60 ఎకరాల భూములు దేవాదాయశాఖ పరిధిలోని ఉన్నాయని, వాటిని వేలం పాటలో సాగు చేసుకొని దేవాలయాలకు దూపదీప నైవేద్యాలను కల్పించాలని గత 2 సంవత్సరాలుగా భూముల వేలం పాట నిర్వహించక గ్రామంలోని కొందరు పెద్ద మనుషులు అక్రమంగా సాగు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో సాగు చేసిన వారు సైతం కౌలు చెల్లించకుండా దేవాలయ పరిరక్షణను గాలికి విలేశారని దేవాదాయశాఖ వారు భూములను పరిరక్షించి వేలం పాటలో ఆలయాల నిర్వహణ, దేవాలయాల ఆధునీకరణకు నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు మోహన్‌యాదవ్, బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, పరుశురాం, శేఖర్, తిరుపతి, పెద్దయ్య, మేకల శ్రీనివాస్‌యాదవ్, గ్రామ పెద్దలు శివారెడ్డి, మద్దిలేటి, ఆలయ పూజారి గ్రామస్థులు పాల్గొన్నారు.

# సబ్సిడర్

- సబ్సిడీపై మెల్లమెల్లగా రాయితీ ఎత్తేస్తున్న ప్రభుత్వం
- పెట్రోలు, డీజిల్ ధరలు మెల్లమెల్లగా పైపైకి..
- గ్యాస్ సబ్సిడీ ఎత్తివేతపై వినియోగదారుల్లో ఆందోళన
- నెలకు రూ.4 పెంచి, వచ్చే మార్చికల్లా పూర్తిగా ఎత్తివేత
- తాజాగా సబ్సిడీ సిలిండర్‌పై రూ.2 పెంచిన కేంద్రం
- గతంలో పోలిస్తే క్షీణిస్తున్న సిలిండర్ ధరలు

**(ఆంధ్రజ్యోతి,వనపర్తి):** కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ ఎత్తివేయాలని తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరుగుదలతో సతమతమవుతున్న తరుణంలో గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ ఎత్తివేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కలవరపడుతున్నారు. సబ్సిడీ వంటగ్యాస్ ధరను పెంచుకుంటూ వెళ్లి వచ్చే మార్చి నాటికి రాయితీని ఎత్తి వేయాలని కేంద్ర పెట్రోలియం శాఖ నిర్ణయించింది. ఈ మేరకు నెలకు రూ. 4 చొప్పున ధరలు పెంచాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చమురు సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు వచ్చిందే తడవుగా మంగళవారం సంస్థలు ఈనెల వాటాకింద రూ. 2 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో గ్యాస్ వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. దీపం, ఉజ్వల యోజన కింద ఇప్పటి వరకు సబ్సిడీ గ్యాస్ కనెక్షన్లు మహిళా సంఘాల సభ్యులకు అందజేసేవారు. అయితే తాజా నిర్ణయంతో వారిని సబ్సిడీ నుంచి తొలగించనున్నారు. కొద్ది రోజుల కిందట రాయితీ సొమ్మును చమురు సంస్థలకు ఇవ్వడాన్ని ఆపేసింది. నగదు బదిలీ పథకం కింద గ్యాస్‌కు చమురు సంస్థ నిర్దేశించిన సొమ్మును వినియోగదారుడే చెల్లిస్తే రాయితీ సొమ్మును ప్రభుత్వం వారి ఖాతాలోకి జమ చేస్తోంది. అయితే కొద్దిరోజుల క్రితం చమురు ధరల క్షీణత కారణంగా వంటగ్యాస్ ధర తగ్గింది రూ.720 పలికిన ధర ప్రస్తుతం రూ. 582 వినియోగదారులు చెల్లిస్తున్నారు. ఇందులో రాయితీ రూపంలో రూ.88 ఖాతాలో జమ అవుతున్నాయి. అయితే ధరలు తగ్గిన సమయంలో కేంద్ర ప్రభుత్వం రాయితీ సొమ్మును తగ్గిస్తుందే తప్పా వినియోగదారుడిపై భారాన్ని తగ్గించడం లేదు. రానున్న రోజుల్లో మొత్తం రాయితీ ఎత్తివేస్తే ఇప్పుడు ఇచ్చే రూ. 88 సబ్సిడీకి కూడా కేంద్ర మంగళం పాడనుంది.



## పెట్రోలు ధరలు పైపైకీ...

పెట్రోలు, డీజిల్ ధరలు కూడా సామాన్యుడికి చుక్కలు చూపెడుతున్నాయి. రోజువారీ ధరల సమీక్ష చేస్తున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒకటి రెండుసార్లు మాత్రమే పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గాయి. అది కూడా రెండు నుంచి మూడు పైసల లోపే.. అయితే పెరుగుదల మాత్రమే ఎక్కువగా ఉంటుంది. పైసల్లో పెరగడం వల్ల ఒకేసారి భారం పడినట్లు వినియోగదారుడు భావించలేడని ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ధరల తగ్గుదల ఫలితాలు వినియోగదారుడికి పదిహేను రోజుల తర్వాతనే అందుతున్నాయనే ఉద్దేశ్యంతో రోజువారీ సమీక్షను మొదలుపెట్టారు. అయితే రోజువారీ సమీక్ష వల్ల పెరుగుదల కష్టాలు తప్పా తగ్గుదల ఫలితాలు తమకు అందడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి జిల్లాలో ద్వి, నాలుగు చక్రాల బండ్లు 30 వేల పైచిలుకు ఉన్నాయి. ఇందులో ద్విచక్రవాహనాలు 18 వేలు. పెట్రోలు ధరలు పెరగడంతో మొత్తం ద్విచక్రవాహనదారులు పెట్రోలు కొట్టించడానికి బెంబేలెత్తుతున్నారు. డీజిల్‌పై కూడా ధరలు పెరుగుతుండటంతో రవాణా కష్టమై భవిష్యత్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటే అవకాశాలున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

## జిల్లాలో 105306 గ్యాస్ కనెక్షన్లు...

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 1,05,306 ఉన్నాయి. ఇందులో కొత్తగా దీపం పథకం కింద 16,030 మంది దరఖాస్తు చేసుకోగా 11,315 గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. గ్యాస్ సబ్సిడీని ప్రభుత్వం నగదు బదిలీ పథకం కింద వినియోగదారుడి ఖాతాలోనే జమ చేస్తుంది. గతంలో రూ. 720 ఉన్న వంటగ్యాస్ ధర తాజాగా రూ. 582 కు చేరింది. అయితే గతంలో రూ.220 నుంచి రూ. 250 వరకు సబ్సిడీ రూపేణ ఖాతాలో జమ అయ్యేది. వంట గ్యాస్ ధర తగ్గిన తర్వాత వినియోగదారుడిపై భారాన్ని తగ్గించని ప్రభుత్వం కేవలం రాయితీ సొమ్మును మాత్రమే తగ్గిస్తూ వస్తోంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ మధ్య కాలంలో గ్యాస్ సబ్సిడీ తక్కువగా జమ అవుతుందని ఆందోళన వ్యక్తం చేయడానికి కారణం కూడా ఇదేనని చెప్పవచ్చు. గ్యాస్ ధర తగ్గినప్పుడల్లా ప్రభుత్వం రాయితీ సొమ్మును కాకుండా వినియోగదారుడి మూల వాటాను తగ్గించాలని కోరుతున్నారు. అయితే దశలవారీగా కేంద్ర ప్రభుత్వం రాయితీలను అన్నింటినీ ఎత్తివేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

● జిల్లా వ్యాప్తంగా ఆలయాలలో వరలక్ష్మి వ్రత పూజలు ● అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు



సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు



భక్త మార్కండేయ ఆలయంలో వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

**వనపర్తి టౌన్:** శ్రావణ శుక్రవారం పురష్కరించుకొని జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయం, రామాలయాలలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కలశపూజల్లో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం 2వ శ్రావణ శుక్రవారం రోజున ఈ వ్రతాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఈ వ్రతాలలో మహిళలు కంకణదారణతో లక్ష్మి అమ్మవారిని అవాహనం చేసుకొని తాము సుమంగళిగా ఉండాలని తమ కుటుంబాలు సిరిసంపదలతో తులతూగాలని కోరుకుంటారు. లక్ష్మి దేవత కటాక్షంతో తమ కోర్కెలు తీరుతాయని భక్తులు ఈ వ్రతాలు చేపట్టారు. వెంకటేశ్వర ఆలయంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రఘునాథశర్మ, పూజారులు, గురు ప్రసాదాచార్యులు, భాస్కరాచార్యులు, రాఘవాచార్యులు, రామచంద్రాచార్యులు, గంగాధర్, పాల్గొన్నారు.

**వీపనగండ్ల:** శ్రావణ మాసం పురష్కరించుకొని మండలంలోని పలు ఆలయాలలో వరలక్ష్మి దేవి వ్రతాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కల్వరాల, తూంకుంట గ్రామాలలోని ఆలయాలలో సామూహిక వరలక్ష్మి దేవి వ్రతాలను చేశారు. శ్రావణ మాసంలో ఈ వ్రతాన్ని ఆచరిస్తే ఇంటిల్లిపాది ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో కలిగి ఉంటారని నమ్మకం. అమ్మవారికి రకరకాలనైవేద్యాలు చేసి పూజలో ఉంచి లక్ష్మిదేవి కటాక్షం లభిస్తుందని మహిళలు నమ్ముతారు. వరలక్ష్మి దేవివ్రతాన్ని ఆచరించరిస్తూ పూజలు చేశారు.

**కొత్తకోట:** మండలంలో పలు దేవాలయాల్లో సమూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసం శుక్రవారం కావడంతో పట్టణంలోని భవాని శంకర, భక్త మార్కండేయ, కన్యాక పరమేశ్వరి వాసవి మాత, రాఘవేంద్రస్వామి, సంకల్ప సిద్ది సాయినాథ, కానాయపల్లి గ్రామ శివారులోని కోటి లింగేశ్వరస్వామి, ఆలయాల్లో మహిళలు పెద్ద అధిక సంఖ్యలో తరలి రాగ దేవాలయాల పూజారులు భక్తిగా వ్రతాల పూజలను చేయించారు. 12వ వీధిలో హిందూ వాహిని ఆధ్వర్యంలో జరిగిన వ్రతాల్లో బీజేపీ జాతీయ దళిత మోర్చ కార్యవర్గ సభ్యురాలు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం మహిళలకు వాయునాలు అందించారు. వరలక్ష్మి వ్రతాల సందర్భంగా ఆలయాల నిర్వాహకులు బాలనారయణ, ఎస్. రాయులు, సంబారి శ్రీనువాసులు, సూర నాగరాజు, సూర చంద్రశేఖర్, రాము, మళ్ళికార్జున్, కండక్టర్ శేఖరయ్య, దాసరి సురేష్, తదితరులు ఉన్నారు. పూజల్లో పాల్గోన్న భక్తులకు అన్నదానం చేశారు.

భూ కబ్జాదారుల

## ఆగడాలను అరికట్టాలని వినతి



ధర్నా చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

**వనపర్తి:** జిల్లాలో పెరుగుతున్న భూ కబ్జాదారుల ఆగడాలను అరికట్టాలని వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ నిరంజన్ రావుకు వినతి పత్రం అందచేశారు. వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మద్దిరాల విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాలలో కొందరు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. పెద్దమందడి మండలం మనిగిల్ల శివారులో సర్వే నెంబర్ 540, 616 వరకు దాదాపు 600 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. గతంలో కూడా ఈ అంశంపై కలెక్టర్‌కు పిర్యాదు చేశామని అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని కాపాడి పేద దళితులకు పంపిణీ చేయాలని డిమాండు చేశాడు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కర్, వెంకటేష్, దేవాచారి, సత్యంచారి, చంద్రశేఖర్ యాదవ్, ఎండి. షఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో

## మధ్యాహ్న భోజనాన్ని ప్రవేశపెట్టాలి




నూతన కమిటీతో జిల్లా అధ్యక్షులు సైదులు

**అచ్చంపేట అర్బన్:** ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వర్థం సైదులు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు వర్థం సైదులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షులుగా రేణుకుమార్, ఉపాధ్యక్షులు రమేష్, ఈశ్వర్, సహాయ కార్యదర్శులు మల్లేష్, శ్రీకాంత్‌లతో పాటు గల్స్ కన్వీనర్‌గా మౌనిక, కో కన్వీనర్ అనితలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

### -తహసీల్దార్ చంద్రశేఖర్

**తాడూరు :** ఎలాంటి పర్మిషన్లు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టుగా గమనించి కొంతమంది తాడూరు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నటువంటి తాడూరు గ్రామానికి చెందిన 4ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనపర్చుకొని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించారు. పట్టుబడిన నాలుగు ట్రాక్టర్లకు ఒక్కో ట్రాక్టర్‌కు 3వేల చొప్పున 12,000 రూపాయలు జరిమానా చొప్పున తహసీల్దార్ విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎలాం టి పర్మిషన్లు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

# తగ్గని మోత భారం



అధిక బరువున్న బ్యాగులను మోస్తున్న విద్యార్థులు

- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్
- అధిక బరువుతో అనారోగ్యం బారిన విద్యార్థులు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

**వనపర్తి విద్యావిభాగం:** విద్యార్థులు కిలోల కొద్ది పుస్తకాలు మోస్తూ అనారోగ్యానికి గురవుతున్నారని గ్రహించిన ప్రభుత్వం ప్రక్షాళన చర్యలు చేపట్టింది. బ్యాగు బరువును తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు జారీ చేసి రోజులు గడుస్తున్నా ఎక్కడ కూడా బరువు తగ్గిన దాఖలాలు కన్పించడం లేదు. బండెడు పుస్తకాల బరువుతో నడుం వంగిపోతున్న బాల్యానికి ఊరటనివ్వాలని ఆదేశాలు జారీ చేస్తే ప్రైవేట్ పాఠశాలలు భేఖాతర్ చేస్తున్నాయి. జిల్లాల్లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, మెటీరియల్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద దోచుకుంటున్నాయి. వాటిని అరికట్టడంలో జిల్లా విద్యాశాఖ విఫలమైందని చెప్పవచ్చు. విద్యార్థులకు విషయ పరిజ్ఞానం, అవగాహన, మానసిక ఎదుగుదలకు తోడ్పడేలా బోధన కొనసాగించాలని పాఠశాలలను రాష్ట్ర విద్యాశాఖ ఆదేశించింది. అయితే ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయాల్సిన విద్యాశాఖాధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నాయి.

### జిల్లాలో 713 పాఠశాలలు..

జిల్లాలో 713 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అందులో 98 వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 536 ప్రభుత్వ పాఠశాలలు, 170కి పైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. చిన్నారులు పుస్తకాల అధిక బరువు మోస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు. విద్యాశాఖాధికారులు ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయడంలో విఫలమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మార్గదర్శకాలు..

- రాష్ట్ర అకాడమిక్ అథారిటీ, ఎస్‌సీఆర్‌టీ నిర్దేశించిన పాఠ్య పుస్తకాలను మాత్రమే ఉపయోగించాలి.
- ఎస్‌సీఆర్‌టీ నిర్దేశించిన పుస్తకాల సంఖ్య దాటరాదు.
- కాన్సెప్ట్‌ని విద్యార్థులు అవగాహన చేసుకునేలా చేయాలి. భావ వ్యక్తీకరణకు స్వేచ్ఛ ఇవ్వాలి.
- విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి పాటుపడాలి.
- ఆటలు, కళలు, సాంస్కృతిక విభాగాల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించాలి.

### తీసుకోవాల్సిన చర్యలు

- ఏ రోజు ఏ పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను తీసుకురావాలో ముందుగానే చెప్పాలి.
- బ్యాగు విద్యార్థికి సౌకర్యంగా ఉండేటట్లు తల్లిదండ్రులు చూసుకోవాలి.
- బరువైన స్కూల్ బ్యాగ్‌ల ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యల గురించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయులు కౌన్సెలింగ్ ఇవ్వాలి.

### నిబంధనలు పాటించకుంటే చర్యలు



పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. ప్రభుత్వ నిబంధనలను దిక్కరిస్తే అలాంటి పాఠశాలపై చర్యలు తీసుకుంటాం. జీవో ప్రకారం అన్ని పాఠశాలల్లో అవగాహన కల్పిం చాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

సుశీంధర్ రావు, డీఈవో

### విద్యార్థులను చూస్తుంటే బాధగా ఉంది



ప్రభుత్వ ఆదేశాలను పాఠశాలలు పట్టించుకోవడంలేదు. విద్యార్థులు అధిక బరువు గల బ్యాగులు మోసుకుంటూ వెళ్తుంటే బాధేస్తోంది. విద్యాశాఖాధికారులు ప్రభుత్వ ఆదేశాలను పకడ్బందీగా అమలయ్యేలా తనిఖీలు చేపట్టాలి.

- ఆశన్న

### జీవో ప్రకారం పాఠశాలలు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలి



జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలి. విద్యార్థులకు అనవసరమైన పాఠ్యపుస్తకాలు, మెటీరియర్, నోట్ పుస్తకాలు అంటూ మోయించకుండా చూడాలి. 1, 2వ తరగతి విద్యార్థులు కూడా 4, 5 కేజీల వరకు పుస్తకాల బ్యాగును భుజాన వేసుకొని వెళ్తుంటే బాధగా ఉంది.

- సురేష్

## బైక్ ఢీకొని యువకుడి మృతి

**దోమలపెంట:** బైకుపై ప్రయాణిస్తున్న యువకుడు వేగంగా కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం వటువర్లపల్లి గ్రామానికి చెందిన చిగుర్ల గాలయ్య(22) తన మిత్రులైన రాజు, భాస్కర్‌లతో కలిసి బైక్‌పై గ్రామ సమీపంలో ఉన్న బోరెడ్డిపల్లిబావి చెరువు వద్దకు వెళ్ళి తిరిగి వస్తుండగా వేగంగా వచ్చిన బైక్ అదుపు తప్పి కరెంట్ స్తంబానికి ఢీకొట్టింది. దీంతో గాలయ్య అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వటువర్లపల్లి వైద్య చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడికి రెండు నెలల క్రితమే తిర్మలాపూర్ గ్రామానికి చెందిన అంజమ్మతో వివాహం అయ్యింది. సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం కొరకు మృతదేహాన్ని అమ్రాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఆర్టీసీ కార్మికుల

# సమస్యల పరిష్కారమే టీఎంయూ లక్ష్యం

### టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి

**వనపర్తి టౌన్:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు టీఎంయూ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి ఆర్టీసీ డిపో ముం దు టీఎంయూ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పెండింగ్‌లో ఉన్న 2013 పేస్కేల్ బకాయిలను 50 శాతం ఇప్పించామని ఇతర బకాయిలను బాండ్లరూపంలో ఇప్పించినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న 2012 లీవ్ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు ఇప్పించిన ఘనత, మాదేనని అన్నారు. యూనిఫాం బకాయిలు 50 శాతం ఇప్పించామని అన్నారు. మిగతావి కూడా ఈ నెలలో ఇప్పిస్తామన్నారు. చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు 15 వందల మందికి ఉద్యోగాలు ఇప్పించామన్నారు. చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగం వద్దనుకుంటే గతంలో లక్ష ఇచ్చే వారని దానిని రూ. 5 లక్షలకు పెంచాలన్నారు. ఆర్టీసీలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయించామని అన్నారు. టీఎంయూకు రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మద్దతు ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ థామస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చలపతిరెడ్డి, మారయ్య, రాష్ట్ర కార్యదర్శులు మోహన్‌లాల్, వహీద్, జీఎల్ గౌడ్, రవీందర్‌రెడ్డి, డీఎస్ చారీ, కాశీ విశ్వనాథ్, నీలస్వామి, గోపి, డీబీకే రెడ్డి, కృష్ణ, వీఎస్. రెడ్డి, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.



టీఎంయూ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అశ్వత్థామరెడ్డి

## మాడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ

**పెబ్బేరు:** మండల కేంద్రం సమీపంలోని ప్రభుత్వ మాడల్ స్కూల్‌ను శుక్రవారం మండల తహసీల్దార్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాలలో వంట సామాగ్లను, సరుకులను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెను ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఫాతిమాతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని కోరారు.

## ఎస్సీ వర్గీకరణతోనే న్యాయం

**చిన్నంబావి:** దళితులలో వెనకబాటుకు గురి అవుతున్న కులాలను అభివృద్ధిలోకి తీసుకురావాలంటే అది ఎస్సీ వర్గీకరణతోనే సాధ్యమని మండల అధ్యక్షుడు సంపంగి మద్దిలేటి తెలిపారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్ష కేంద్రంలో మాట్లాడుతూ దళితులకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని ఆ తర్వాత కులాలపరంగా వర్గీకరించాలని అన్నారు. కేంద్రం ఈ విషయంలో సానుకూలంగా ఉందంటూ తత్సారం చేస్తుందని వెంటనే పార్లమెంట్ సమావేశాలలో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు వారి దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నరసింహ్మా, ప్రధాన కార్యదర్శి బాలకిష్టయ్య, నాయకులు కాన్సీరాం, కురుమయ్య, బాలవెంకట్ ఉన్నారు.

## కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

**వీపనగండ్ల:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దీక్షలు శుక్రవారం 11వ రోజుకు చేరాయి. ఎస్సీ వర్గీకరణ చేపట్టి దళిత వర్గాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు నాగరాజు కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని, హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తప్పెటస్వామి, పెద్దరాముడు, రవివర్మ ఉన్నారు.

## కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం


కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

**వీపనగండ్ల:** వామపక్షాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో కేసీఆర్ దిష్టి బొమ్మను సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు దహనం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను ఎండగడుతుంటే ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుందని వామపక్షాలు, జర్నలిస్టులపై అక్కస్సు కక్కుతున్నారని సీపీఎం మండల నాయకులు బాలస్వామి అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆంజనేయులు, వెంకటేష్‌గౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆది తదితరులు ఉన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**వీపనగండ్ల:** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం మండల సర్వసభ్య సమా వేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అప్జలోద్దీన్ తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచుల, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరు కావాలనికోరారు.

## నేడు విజ్ఞానంపై అవగాహన

**వనపర్తి విద్యావిభాగం:** తెలంగాణ రాష్ట్ర సాంకేతిక మండలి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ వారి ఆదేశాల మేరకు సుస్థిరాభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పట్టణంలోని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో కార్యక్రమం ఉదయం 10గంటలకు ప్రారంభం అవుతుందని, సుస్థిరాభివృద్ధికి విజ్ఞానశాస్త్రం, సాంకేతిక నూతన్న ఆవిష్కరించి దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి అంశంపై రాష్ట్ర అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ చాంద్‌పాష, సాంబశివరెడ్డిలు ప్రసంగించనున్నట్లు తెలిపారు.

# తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత

- ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- ఖాళీ పోస్టులతో ముందుకు సాగని పనులు



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం


కార్యాలయంలో సిబ్బంది కొరతతో పేరుకుపోయిన ఫైల్స్

**చిన్నంబావి:** మండల తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసి 10 నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అధికారులను నియమించలేదు. దీంతో కార్యాలయంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన మండలంలో 30 వేల జనాభా ఉంది. 17 రెవెన్యూ గ్రామాలలో సుమారు 8 మంది వీఆర్‌వోలకు ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి 5 నుంచి 6 గ్రామాల చొప్పున రెవెన్యూ సేవలు అందించాలి. విద్యార్థుల కుల, ఆదాయం, స్థానిక ధృవపత్రాల జారీలో జాప్యం జరుగుతుంది. ప్రభుత్వం నేడు రైతు లకు ఎకరాకు రూ.4వేలు పథకంలో విరాసత్, పట్టామార్పిడి, ఆన్‌లైన్ చేయడం, ప్రభుత్వానికి రెవెన్యూ సంబంధించిన సమాచారంను సకాలంలో పంపుటకు సిబ్బంది కొరత ఉంది. అంతేకాకుండా గ్రామాలలో రెవెన్యూ పన్నులు, నీటిపన్నులు వసూళ్ళలో కూడా జాప్యం జరుగుతుంది. దళిత భూపంపిణీ, శవపంచనామాలు తదితర పనులకు గిర్దావర్ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయంలో డీటీ, సీనియర్ అసిస్టెంట్ ఒకరు, గిర్ధివర్ ఒకరు, ముగ్గురు అటెండర్లు, ఐదు వీఆర్‌వోలు, వాచ్‌మెన్ ఒకరు, ఒక స్వీపర్ ఉండాల్సింది పోయి ఏడుగురు సిబ్బందితో పనులు కాక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సిబ్బందిని నియమించి పనులు సకాలంలో జరిగే విధంగా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**అనేక పనులు నిలిచిపోతున్నాయి..: నదీం అహ్మద్, తహసీల్దార్**



కార్యాలయంలో సిబ్బంది కొరతతో అనేక పనులు నిలిచిపోతున్నాయి. ఇప్పటికే కలెక్టర్ దృష్టికి సిబ్బంది కొరత విషయాన్ని వా రికి నివేదించాం. త్వరలోనే సిబ్బంది కొరతను తీర్చే అవకాశం ఉంది. ఈ విషయంలో పై అధికారులు చొరవ తీసుకోవాలి.

# మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టండి

- నాలుగు గ్రామాలలో కలెక్టర్ సుడిగాలి పర్యటన
- ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించాలన్న కలెక్టర్


మరుగుదొడ్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

**ఖిల్లాఘనపురం:** ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించి పారిశుధ్యాన్ని సంరక్షించాలని కలెక్టర్ శ్వేతామహంతి మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని సోలీపూర్, మానాజీపేట, మాల్కాపూర్, మామిడిమాడ గ్రామాలలో సుడిగాలి పర్యటన చేశారు. మండల వ్యాప్తంగా స్వచ్ఛ భారత్ ద్వారా 9080 మరుగుదొడ్లు మంజూరు కాగా అందులో 6554 మరుగుదొడ్లు పూర్తయ్యాయని, మిగత 25 26 మరుగుదొడ్లు ఎందుకు పూర్తి చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో ఆమె కాలినడకన పర్యటిస్తూ నిర్మాణాలలో ఉన్న మరుగుదొడ్లను నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. నిర్మాణాలు పూర్తయిన వారికి బిల్లులు అందాయా అని అధికారులను ప్రశ్నించారు. బిల్లులు రాని వారికి తక్షణమే చెక్కులను అందజేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించేలా కృషి చేయాలని సూచించారు. మామిడి మాడ గ్రామంలో మరుగుదొడ్డి నిర్మాణాలకు స్థలం లేదని నివేదిక చూపిన పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాలు చెప్తావా అంటూ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారి చేయమని టెక్నికల్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో గణేష్, ఎంపీడీవో రెడ్డయ్య, తహసీల్దార్ హరిలాల్, ఈవోపీఆర్‌డీ వినోద్‌గౌడ్, ఏపీవో సురేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు, సింగిల్‌విండో అధ్యక్షులు తేనేటి రవీందర్‌రెడ్డి, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

### ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని
## అధికారికంగా నిర్వహిస్తున్నాం

- కలెక్టర్ శ్వేతామహంతి

**వనపర్తి కలెక్టరేట్:** ఈనెల 6న ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్వేతామహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయని, ప్రతిసంవత్సరం ఆగష్టు 6న ఆచార్య జయశంకర్ జయంతిని నిర్వహించాలని ఆదేశాలు వచ్చినట్లు ఆమె తెలిపారు. అందువల్ల జిల్లాలోని అందరు అధికారులు 6వ తేది వారివారి కార్యాలయంలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాలని, అలాగే కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

## సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

**వనపర్తి వ్యవసాయం:** సీఎం సహయనిధి నుంచి మంజూరైన చెక్కును శుక్రవారం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి అందజేశారు. గోదావరి పుష్కరాలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శేఖర్ కుటుంబానికి 3 లక్షల రూపాయలు మంజూరు కాగా కుటుంబసభ్యులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు వాకిటిశ్రీధర్, టీఆర్ఎస్ నాయకులు మాణిక్యం. ప్రేమ్‌నాథ్‌రెడ్డి, యోగానందరెడ్డి, లతీఫ్, బండి చంద్రయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చేప పిల్లల సరఫరాకు ఫిషర్‌మెన్‌లు కావాలి

**వనపర్తి కలెక్టరేట్:** మత్స్యశాఖ వనపర్తి నందు చేప పిల్లల సరాఫరాలో 60 రోజులు పని చేసేందుకు ఫిషర్‌మెన్‌లు కావాలని, ఆసక్తి గల వారు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించగలరని ఒక ప్రకటన తెలిపారు. స్థానిక అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఐఎఫ్‌టీసీ మూడు నెలలు ట్రైనింగ్ చేసిన వారు కార్యాలయం సంప్రదించగలరు.



సినిమా సమాచారం

వెంకటేశ్వర : గౌతంనంద

### పెబ్బేరులో కూరగాయల ధరలు

కిలోకు.. రూ.లలో..



| | | | |
|---|---|---|---|
| టమాట | 60 | పచ్చిమిర్చి | 80 |
| కాకరకాయ | 40 | ఉల్లిగడ్డ | 15 |
| ఆలుగడ్డ | 40 | బెండకాయ | 40 |
| క్యారెట్ | 30 | క్యాబేజీ | 30 |
| బీట్‌రూట్ | 30 | దొండకాయ | 30 |
| చెవులకాయ | 40 | బీరకాయ | 30 |
| వంకాయ | 40 | బీన్స్ | 40 |

### పెబ్బేరు మండల సమాచారం

| | |
|---|---|
| తహసీల్దార్ | - 9000101524 |
| ఎంపీడీవో | - 8008901097 |
| ఎంఈవో | - 9494307326 |
| వ్యవసాయాధికారి | - 7288894329 |
| పీఆర్ఏఈ | - 9440395245 |
| ఏపీఎం | - 8790990705 |
| ఎస్సై | - 9440795729 |
| విద్యుత్ ఏఈ | - 9440813500 |
| పశువైద్యాధికారి | - 7702771478 |
| ఈజీఎస్ పీవో | - 7095504747 |
| ఇఓఆర్డీ | - 8464956562 |
| ట్రాన్స్‌కో ఏఈ | - 9440813500 |

## ఇంటర్వ్యూ

### స్వచ్ఛ గ్రామంగా
## వెలగొండను తీర్చిదిద్దుతాం

- వసంత లక్ష్మి, గ్రామసర్పంచు, వెలగొండ



**చిన్నంబావి:** గ్రామంలో ఉన్న అన్ని వీధులు, వాటర్ ట్యాంకులు, బోరింగ్‌లు, నల్లాల దగ్గర పరిశుభ్రతను పాటించి వెలగొండ గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చుదిద్దుతామని వెలగొండ గ్రామ సర్పంచు వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

**గత మూడు సంవత్సరాలుగా గ్రా మాన్ని ఏవిధమైన అభివృద్ధి చేశారు..?**

గ్రామంలో గత మూడు సంవత్సరాలుగా రోడ్ల నిర్మాణం కోసం కోటి 25 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం, మిషన్ కాకతీయ పథకంలో గ్రామంలోని చెరువుల మరమ్మత్తులకు రూ.6లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేశాం.

**తాగునీటి సమస్య ఉందా...? ఏ విధమైన ప్రణాళిక చేశారు...?**

తాగునీటికి ఇబ్బందులు లేవు. గ్రామంలో మినీ వాటర్ ట్యాంకు నిర్మాణం చేశాం. ప్రస్తుతం మిషన్ భగీరథ పథకంలో రూ. 20 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేస్తున్నాం.

**గ్రామంలో హరితహారంలో ఎన్ని మొక్కలు నాటారు...?**

గ్రామంలో హరితహారంలో భాగంగా 22 వేల గుంతలు తవ్వారు. 18 వేల మొక్కలు నాటడం జరిగింది.

# పల్లెల వైపు చూడని బస్సులు

● బీటీ రోడ్డు ఉన్నా రాణి వైనం ● చదువులకు దూరం అవుతున్న విద్యార్థులు

నర్సింగాపురానికి బస్సు నడపాలని ర్యాలీ చేస్తున్న విద్యార్థులు(ఫైల్)



**మదనాపురం:** మండలంలోని చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడపడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ఒకవైపు పల్లె వెలుగు, ఏసీ, వీడియో కోచ్ వంటి నూతనమైన హంగులతో ఉన్న బస్సులను పట్టణాలకు పంపుతుంది. కానీ పల్లెల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలో ద్వారకా నగరం, నర్సింగాపురం, రామన్‌పాడు, సరళాసాగర్, దంతనూర్, గోవిందహళ్లి, కర్ని, గోపన్‌పేట తదితర గ్రామాలకు బస్సులు రావడం లేదు. రవాణా సౌకర్యం లేక ఆయా గ్రామాల్లోని విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారు. కొందరు వ్యయప్రయాసాలకోర్చి ప్రైవేట్ వాహనాల్లో కొత్తకోటకు వెళ్లి చదువుకుంటున్నారు. బాలికలను మాత్రం తల్లిదండ్రులు కళాశాలకు పంపడానికి ఇష్టపడడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు లాభాలే కాకుండా ప్రయాణికుల పరిస్థితి అర్థం చేసుకొని బస్సులను నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### బాలికలు చదువుకు దూరం అవుతున్నారు



గ్రామంలో ఉన్న పాఠశాలలో చదువు అయిన తర్వాత మదనాపురం, కొత్తకోటకు వెళ్లాల్సి ఉంటుంది. కనీసం గ్రామాలకు ఉదయం సాయంత్రం వేళల్లో బస్సు నడిపితే బాగుంటుంది. రవాణా సౌకర్యం విద్యార్థినులు చదువుకు దూరం అవుతున్నారు. కనీసం విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడపాలి.

\- ప్రవీణ్‌రెడ్డి

## డిగ్రీ ఫలితాల్లో వికాస్ కళాశాల ప్రతిభ

**ఆత్మకూర్:** పాలమూరు యూనివర్సిటీ రెండవ సెమిస్టార్ డిగ్రీ ఫలితాల్లో ఆత్మకూర్ వికాస్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బీజడ్సీ మొదటి సంవత్సరంలో పల్లవి 9.85, మహేశ్వరీ 9.67, తాయబ్ 9.56, బీఏ మొదటి సంవత్సరంలో నిహారిక 9.26, బీఎస్సీ మొదటి సంవత్సరంలో భారతి 9.11 సాధించి జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు తెచ్చుకున్నారని కళాశాల యాజమాన్యం దైవదీనం, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రమేష్‌శెట్టి తెలిపారు.

## అనారోగ్యంతో చిన్నకడ్మూర్ సర్పంచు మృతి

**అమరచింత:** గత కొన్ని నెలల నుంచి కిడ్నీల వ్యాధితో బాధపడుతున్న చిన్నకడ్మూర్ సర్పంచు మాల తిప్పన్న శుక్రవారం మృతి చెందాడు. అస్వస్థతకు గురైన తిప్పన్నను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## 9న ఛలో ఢిల్లీని జయప్రదం చేయండి

**అమరచింత:** అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 9వ తేదీన చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ ఉపాధి అటవీ హక్కులు, 2013 భూసేకరణ, ఆహార భద్రత, గ్రామీణ పేదలకు కనీస వేతనాల అమలనే డిమాండ్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

## బాలల హక్కులపై అవగాహన

**మదనాపురం:** మండల పరిధిలోని అజ్జకొల్లు గ్రామంలో శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో బాలల హక్కులపై శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎస్వీకే సిబ్బంది మాట్లాడుతూ బాలలందరు చదువుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే అమ్మాయిలకు వివాహం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్వీకే సిబ్బంది మస్తానయ్య, నాగలక్ష్మి, అనూష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాలు వాల్‌పోస్టర్లు విడుదల

**అమరచింత:** కర్ణాటక రాష్ట్రంలోని గుల్బార్గ హజ్రత్ ఖాజ చందీ నవాజ్ దర్గాషరీఫ్ 613వ ఉర్సు ఉత్సవాల సందర్భంగా జామియామసీద్ సభ్యులు శుక్రవారం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కుల మతాలకు అతీతంగా అందరూ ఉత్సవాల్లో పాల్గొనాలని జామియా మసీద్ సెక్రటరీ కలాంపాషా కోరారు. కార్యక్రమంలో తౌఫిక్, సర్దార్ బేగ్, దస్తగిర్‌నయ్యర్, నయ్యూం, ఫరీద్, అన్వర్ పాల్గొన్నారు.

## 'టీఆర్ఎస్వీ నాయకత్వంలోనే సమస్యల పరిష్కారం'

**కొత్తకోట:** టీఆర్ఎస్వీ నాయకత్వంలోనే విద్యార్థుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సంఘం వనపర్తి జిల్లా కో ఆర్డినేటర్ మహేష్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో టీఆర్ఎస్వీ సభ్యత్వాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ అధికార పార్టీ అనుబంధ సంఘాలు బలోపేతంగా ఉంటేనే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు గాడీల ప్రశాంత్, కటీక శ్రీనుజీ, వశీం ఖాన్, మహేష్, నాసనల్లి రాజు పాల్గొన్నారు.

## కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రాస్తారోకో

**అమరచింత:** ముఖ్యమంత్రి కేసీఆర్ కమ్యూనిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం అమరచింతలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గోపి, మండలనాయకులు అజయ్ మాట్లాడుతూ రాజరికపు పాలనను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులది అన్నారు. పేద ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఆందోళనలు చేస్తున్న కమ్యూనిస్టుల వైఖరిని జీర్ణించుకోలేని ముఖ్యమంత్రి కమ్యూనిస్టు, ప్రతిపక్షాలపై విషం చిమ్ముతున్నాడని విమర్శించారు. అనంతరం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్,



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

శ్యాంసుందర్, రమేష్, రాజు, బుచ్చన్న, విష్ణు, రఘు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో రాఖీ పౌర్ణమి సంబరాలు



నివేదితలో రాఖీలు కడుతున్న బాలికలు





కొత్తకోట ప్యూపిల్స్ స్కూల్‌లో గోపికల వేషధారణలో బాలికలు

**కొత్తకోట:** మండల కేంద్రంలోని కొత్తకోట ప్యూపిల్స్ స్కూల్, నివేదిత కాన్సెప్ట్ స్కూల్లో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్యూపిల్స్ స్కూల్‌లో వరలక్ష్మి పూజలతో పాటు రాఖీ పౌర్ణమి, శ్రీ కృష్ణా జన్మష్టామి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాజవర్దన్ మాట్లాడుతూ భారత దేశ సంస్కృత సంప్రదాయాలు చాలా గొప్పవని, వాటిని కాపాడాల్సిన బాధ్యత రేపటి పౌరులైన విద్యార్థులపైనే ఉందన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు కృష్ణాష్టమి సందర్భంగా ఉట్లు కొట్టగా, బాలికలు గోపిక వేషధారణలతో ఆటపాటలో పాల్గొన్నారు. అలాగే నివేదిత కాన్సెప్ట్ స్కూల్‌లో బాలికలు బాలురకు రాఖీలు కట్టి శుభాకాంక్షాలు తెలిపారు. ఆయా కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కృష్ణవేణి, ఆశోక్ కుమార్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్సీవర్గీకరణ చేపట్టాలని రిలే దీక్షలు

**ఆత్మకూర్:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని శుక్రవారం ఆత్మకూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహర దీక్షలు చేపట్టారు. దీక్షల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు అజ్జపాగ మాసన్న, అజ్జపాగ లక్ష్మణ్, కట్టెలమండిరాజు, రేవల్లశ్రీనివాసులు, అరుణ్‌కుమార్, రాజు, శ్యాం, సుబ్బు, ఆంజనేయులు, కురుమూర్తి, ప్రసాద్, హసీం, పాల్గొన్నారు.

**అమరచింత:** అమరచింత మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ రిలే దీక్షల్లో పాల్గొనాలని నాయకుడు అజ్జపాగ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రాజు, శ్రీను, ఆంజనేయులు, కురుమన్న, లక్ష్మన్న, సుబ్బు, రాజు, రవికుమార్‌లు ఉన్నారు.

## సినిమా గైడ్





పరమేశ్వరి: ఫిదా
భవాని : జయదేవ్
శ్రీదేవి : మాయమాల్
ఆత్మకూర్‌హైటెక్: ఫిదా

## కొత్తకోటలో కూరగాయల ధరలు

కిలోకు.. రూ.లలో..



| | | | |
|---|---|---|---|
| టమాట | 60 | వంకాయ | 40 |
| కాకరకాయ | 60 | పచ్చిమిర్చి | 80 |
| ఆలుగడ్డ | 30 | ఉల్లిగడ్డ | 16 |
| క్యారెట్ | 80 | బెండకాయ | 40 |
| బీన్స్ | 80 | క్యాబేజి | 40 |
| బీట్‌రూట్ | 60 | దొండకాయ | 40 |
| చెవులకాయ | 50 | బీరకాయ | 60 |

## ఆత్మకూర్ మండలాధికారులు

| | |
|---|---|
| తహసీల్దార్ | - 9100904738 |
| గిర్దావర్ | - 9848464658 |
| ప్రభుత్వ వైద్యశాధికారి | - 9703810854 |
| పశువైద్యాధికారి | - 7702771305 |
| ఎస్సై | - 9652075545 |
| రైల్వే స్టేషన్ | - 08545-224147 |
| ఎంపీడీవో | - 8008901095 |
| వ్యవసాయాధికారి | - 7288894323 |
| సీఐ | - 9440795737 |
| ఏఈ పంచాయతీరాజ్ | - 9440786555 |
| ఏఈ విద్యుత్ | - 9440813499 |

## ఇంటర్వ్యూ

### పంటలకు బీమా రైతులకు ధీమా...

● రవీందర్‌రెడ్డి, మండల విస్తీర్ణాధికారి



**మదనాపురం:** తాము పండించే పంటలకు బీమా చెల్లించి రైతులు ధీమాగా ఉండాలని మండల విస్తర్ణాధికారి రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

**ఆంధ్రజ్యోతి:** పంటలకు బీమా గడువు ఎంతవరకు ఉంది....?

**అధికారి:** వరికి ఆగస్టు 31 వరకు చివరి తేదీ

**ఆంధ్రజ్యోతి:** సబ్సిడీలో ఏఏ రకాల విత్తనాలు, మందులు ఇస్తున్నారు...?

**అధికారి:** సబ్సిడీపై రైతులకు ఆర్ఎన్ఆర్ 500 రూపాయలు, 1010 రకం 625 జింక్ 280 రూపాయలకు ఇస్తున్నారు.

**ఆంధ్రజ్యోతి:** నీటి పొదుపుపై అవగాహన ఇస్తున్నారా....?

**అధికారి:** నీటి పొదుపునకు సంబంధించిన ఫారంఫండ్‌లను నిర్మించుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. స్ప్రింకర్లను కూడా సబ్సిడీతో అందజేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** రైతు సమగ్ర సర్వే ఎంత మేరకు చేశారు....?

అధికారి: మండలంలో రైతు సమగ్ర సర్వే 85 శాతం పూర్తి అయింది. నర్సింగాపురం గ్రామంలో 98 శాతం పూర్తిచేశాం.

# దినఫలాలు

**అదృష్టసంఖ్యలు : 5, 8**



**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** చిన్నారుల విషయాలపై దృష్టి సారిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పిల్లల విజయం ఆనందం కలిగిస్తుంది.



**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. చర్చలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు శుభప్రదం. ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. సంకల్పం నెరవేరుతుంది.



**మిథునరాశి:(మే21-జూన్21):** పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, బీమా వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఆర్థిక విషయాల్లో సోదరీ, సోదరుల సహకారం లభిస్తుంది.



**కర్కాటకరాశి:(జూన్22-జూలై23):** స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం అందుకుంటారు. జన సంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.



**సింహరాశి:(జూలై24-ఆగస్ట్23):** వ్యవసాయ, పరిశ్రమల రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. కొత్తగా ఆలోచించి వృత్తి, వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు.



**కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23):** దూరంలోఉన్న ప్రియతముల నుంచి సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూరుతాయి. రాజకీయ, సినీ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.



**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** బంధుమిత్రులతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రియతముల ప్రవర్తనలో మార్పు గమనిస్తారు. రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.



**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. విద్యార్థులకు లక్ష్య సాధనలో పెద్దల సహకారం లభిస్తుంది. స్టేషనరీ, ఏజెన్సీ, రవాణా రంగాల వారికి శుభప్రదం. సోదరీ, సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** ఆదాయం పెంపొందించుకునేందుకు కొత్త వ్యూహాలు ఆలోచిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల గురించి సమాచారం సేకరిస్తారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం.



**మకరరాశి: (డిసెంబర్22-జనవరి21):** పెట్టుబడుల గురించి ఆరా తీస్తారు. బీమా, పింఛన్ , మ్యూచ్యువల్ ఫండ్స్ వ్యవహారాలకు అనుకూలం. సంస్మరణల్లో పాల్గొంటారు. ఇన్‌స్టాల్ మెంట్స్‌పై వస్తువులు కొనుగోలు చేస్తారు.



**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. బంధుమిత్రులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. జన సంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు.



**మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20):** ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం అందుకుంటారు. బంధుమిత్రులతో విందు, వినోదాల్లో పాల్గొంటారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సహకార సంఘాల వారు లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

# ఏసీటీఓ ఇంటిపై ఏసీబీ దాడులు

- **ఆదాయానికి మించి ఆస్తులున్నట్లుగా నమోదైన కేసు**
- **ఏసీబీ డీఎస్పీ ప్రభాకర్ నేతృత్వంలో ఏసీటీఓ, బంధువుల ఇళ్లల్లో ఏకకాలంలో దాడులు**

**జడ్చర్ల /(ఆంధ్రజ్యోతి)నాగర్‌కర్నూల్:** ఏసీటీఓ బత్తిని సురేందర్‌గౌడ్ ఇంట్లో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఆదాయానికి మించి ఆస్తు లున్నట్లుగా కేసు నమోదు చేసి, ఏసీబీ డీఎస్పీ ప్రభాకర్ నేతృత్వంలో శుక్రవారం జడ్చర్లలో దాడులు నిర్వహించారు. ఏసీటీఓ ఇంటితోపాటు ఆయన బంధువుల ఇళ్లల్లో 8 బృందాలుగా ఏసీబీ అధికారులు ఉదయం 6గంటల ప్రాంతంలో ఏకకాలంలో దాడిచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ సురేందర్‌గౌడ్ వాణిజ్యపన్నులశాఖ కార్యాలయంలో 1986లో నిజామాబాద్ జిల్లాలో అటెండర్‌గా చేరి పదోన్నతిపై నాగర్‌కర్నూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా, మహబూబ్‌నగర్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా, ప్రస్తుతం జడ్చర్లలో ఏసీటీఓగా విధులు నిర్వహిస్తున్నారన్నారు.. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లుగా స్పష్టమైన సమాచారం మేరకు, విచారణ చేపట్టి, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. జడ్చర్లలో ఏసీటీఓ నివాసం ఉంటున్న ఇంటితోపాటు నూతనంగా నిర్మించిన ఇల్లు, మహబూబ్‌నగర్‌లో కుమార్తె, అల్లుడు నివాసం ఉంటున్న ఇంట్లో, మండలంలోని చెర్లపల్లిలో, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం మారేపల్లిలో, నాగర్‌కర్నూల్ పట్టణంలోని వియ్యంకుడి ఇంట్లో, నల్గొండ జిల్లా మోతెలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌గౌడ్ ఇంట్లో, జడ్చర్లలోని సీటీఓ కార్యాలయంలో దాడులు నిర్వహించినట్లు వివరించారు. ఈ దాడుల్లో జడ్చర్లలో ఏసీటీఓ సురేందర్‌గౌడ్‌తోపాటు ఆయన భార్య ఇందిర, కుమారుడు శ్రీకాంత్‌గౌడ్, కుమార్తెలకు సంబంధించిన 2 మూడంతస్తుల భవనాలు, 7ఓపెన్‌ప్లాట్లు, 40ఎకరాల వ్యవసాయభూమి, వివిధబ్యాంకుల్లో 8లక్షల,20వేల బ్యాలెన్స్, దాదాపు 6లక్షలపైచిలుకు ఇన్సూరెన్స్ ప్రీమియం, రెండు కార్లు, 1300 గ్రాముల వెండి వస్తువులు, 57తులాల బంగారు ఆభరణాలున్నట్లు గుర్తించామన్నారు. 57తులాల బంగారు ఆభరణాల్లో 27తులాల ఆభరణాలు కోడలికి సంబంధించినవి ఉన్నాయని, ఏసీటీఓకు సంబంధించి 30తులాల బంగారు ఆభరణాలను మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం గుర్తించిన వాటి వివరాలతో పాటు ఇంకా విచారణ సాగిస్తున్నామన్నారు. కాగా తనపై కావాలనే కొందరు కుట్రపన్ని ఇరికించారని, తన ఆస్తులకు సంబంధించిన అన్ని లెక్కలు ఉన్నాయని ఏసీటీఓ సురేందర్‌గౌడ్ విలేకరులకు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ రవికుమార్, ఇన్‌స్పెక్టర్‌లు రమేశ్ రెడ్డి, మంజుల, వెంకటేశ్, సుదర్శన్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.



తిమ్మాజిపేట మండలం మారెపల్లిలో సురేందర్‌గౌడ్ ఇంట్లో వివరాలు సేకరిస్తున్న ఏసీబీ అధికారులు



జడ్చర్లలో ఏసీటీఓ సురేందర్‌గౌడ్‌తో విచారణ నిర్వహిస్తున్న ఏసీబీ డీఎస్పీ ప్రభాకర్

నాగర్‌కర్నూల్‌లోని నల్లవెల్లిరోడ్డు నాగర్‌కర్నూల్ మోడల్ స్కూల్ సమీపంలో నివసిస్తున్న సురేందర్ గౌడ్ వియ్యంకుడు రామన్ గౌడ్ ఇంటిలో ఏసీబీ ఇన్ స్పెక్టర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. రామన్ గౌడ్ ఇంటిలో లభ్యమైన డాక్యుమెంట్లను పరిశీలించారు. మారెపల్లిలో సురేందర్‌గౌడ్ సన్నిహితుడు చంద్రశేఖర్ అనే వ్యక్తి ఇంట్లో కూడా తనిఖీలు కొనసాగాయి. ఏసీబీ అధికారులు దాదాపు కోటి రూపాయల ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. ఇంకా వివిధ ఆస్తులకు సంబంధించి డాక్యుమెంట్ల పరిశీలన జరుగుతున్నందున అధికారులు పూర్తి స్థాయి సమాచారాన్ని ఇవ్వడానికి నిరాకరించారు.

## పీఆర్ ఈఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

**మహబూబ్‌నగర్ క్రైం:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంచాయతీరాజ్ ఈఈ మురళీధర్‌గౌడ్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. పద్మావతి కాలనీలోని ఈఈ ఇంట్లో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న కారణంగా జడ్చర్లలోని ఏసీటీఓ బత్తిని సురేందర్‌గౌడ్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. అందులో భాగంగానే ఆయన అల్లుడైన మురళీధర్‌గౌడ్ ఇంట్లో సోదాలు చేశారు. ఈ సోదాలో సురేందర్‌గౌడ్ ఆస్తులకు సంబంధించినవి ఏమీ దొరకలేదని, అకౌంట్ నెంబర్లు స్వాధీనం చేసుకుని సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు.

# వేధింపులు భరించలేం..!

**మహబూబ్‌నగర్ :** ఆ అధికారి వేధింపులు భరించలేకపోతున్నాం.. ఫైల్ కదలాలంటే గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది.. చులకనగా మాట్లాడతారు.. మహిళలు అని కూడా చూడకుండా ఇష్టానుసారంగా మాట్లాడతారు.. ఆ అధికారిని కలవడానికి వచ్చిన ఆయన బంధువులు, స్నేహితుల ముందే మహిళా ఉద్యోగులను చులకనగా మాట్లాడతారు.. వారిని రిసీవ్ చేసుకోకుండా ఎక్కువసేపు నిలబెట్టడం వంటి చర్యలు ఎదురవుతున్నాయి... మహిళల ముందు ద్వంద్వార్థాల మాటలతో విసుగు చెందిన ఆ ఉద్యోగులంతా మూకుమ్మడిగా జిల్లా అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు... అందరి ఫిర్యాదులు తీసుకున్న ఆ అధికారి వ్యక్తిగతంగా దర్యాప్తు చేస్తున్నారు... దీనిపై ఉన్నతాధికారులకు నేడోరేపో నివేదిక సమర్పించనున్నారు...

అది జిల్లా పోలీసు కార్యాలయం.. పోలీస్‌బాస్ అక్కడే కొలువుదీరతారు.. ఇక్కడి నుంచి అన్ని స్థాయిల పోలీసు అధికారులకు ఆదేశాలు వెళతాయి... అలాంటి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఓ అధికారి నుంచి వేధింపులు, ఛీత్కారాలు ఎదుర్కొంటున్నారు... జిల్లా అంతటా ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలని, ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చే వారిని మర్యాదగా రిసీవ్ చేసుకొని కూర్చోబెట్టి, మంచినీరు ఇవ్వాలని చెబుతున్న అధికారులు సొంత కార్యాలయంలో పనిచేసే సిబ్బందికే ఇబ్బందులు తప్పని పరిస్థితులు నెలకొనడంతో తలలు పట్టుకోవాల్సి వస్తోంది.

జిల్లా పోలీసు కార్యాలయంలోని పరిపాలనా విభాగంలో పనిచేసే ఓ అధికారి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రెండ్రోజుల క్రితం జిల్లా ఎస్పీ రెమా రాజేశ్వరికి అక్కడ పనిచేసే ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులలో ఉన్న తీవ్రతను గుర్తించిన ఆమె అక్కడ పనిచేసే 22 మంది ఉద్యోగులతో లిఖితపూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నారు. ఇందులో ఆరుగురు మహిళలు కూడా ఉన్నారు.. దాదాపు అందరూ ఆ అధికారికి వ్యతిరేకంగానే ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది.. ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ ఒకట్రెండు రోజుల్లో డీజీపీకి నివేదిక ఇచ్చే అవకాశాలున్నాయి.. ఆయనపై గతంలోనూ ఫిర్యాదులు రాగా 15 రోజుల క్రితం పద్ధతి మార్చుకోవాలని ఎస్పీ మెమో జారీ చేశారు. డీపీఓ కార్యాలయంలో మూడ్రోజులుగా ఇదే విషయం హాట్‌టాపిక్‌గా మారింది..

- షాద్‌నగర్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ జీపీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా అతని పట్ల దురుసుగా వ్యవహరించడంతో ఆ కానిస్టేబుల్ ఎస్పీని కలిసి తన బాధను వ్యక్తపరిచాడు. మహిళా ఉద్యోగులు సంతకాల కోసం వెళితే సంతకాలు చేయకుండా ఒకటికి నాలుగుసార్లు తిప్పుకోవడం, వారిని గంటల తరబడి నిలబెట్టుకోవడంతో ఇక్కడ పనిచేయలేమని ఉన్నతాధికారికి చేసిన ఫిర్యాదులో గోడెళ్ళబోసుకున్నట్లు తెలుస్తోంది. మెడికల్ బిల్లులకు సంబంధించిన ఫైళ్లు టేబుల్‌పైకి వెళితే నేరుగా మెడికల్ బిల్లులు పెట్టుకున్న వ్యక్తికి ఫోన్ చేసి సెటిల్ చేసుకోవడం, రిటైర్డ్ అయిన ఉద్యోగులు తమకు రావలసిన ప్రయోజనాలకు సంబంధించి ఫైల్‌పై సంతకాలకు వెళితే వారిని ఇతర ప్రయోజనాలు ఆశించి సంతకాలు చేయకుండా తిప్పుకోవడం వంటి వేధింపులకు గురిచేయడంతో కొద్దికాలంగా సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. తనకు నచ్చిన వారి ఫైల్‌ను వెంటనే పంపిస్తూ, నచ్చని వారి ఫైళ్లను పెండింగ్‌లో పెడతారు. సిబ్బందితో పాటు హోంగార్డ్‌లను అరె, తొరే అంటూ మర్యాద లేకుండా మాట్లాతారని సిబ్బంది వాపోతున్నారు. తనకు వెహికల్ అలాట్ లేకున్నా వెహికల్ కోసం సంబంధిత సెక్షన్ అధికారులపై ఒత్తిడి చేస్తారు. తీరా వెహికల్ ఇచ్చాక అదిబాగా లేదంటూ సతాయిస్తుంటారు.. ఇలా పలువురు చేసిన ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ మరో మారు వ్యక్తిగతంగా విచారణ చేస్తున్నారు. సమగ్ర నివేదికను తయారు చేసిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నదే తేలాల్సి ఉన్నది.

# ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు ఉరి వేసుకున్న బాలస్వామి

**పెబ్బేరు:** చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు సంతబజార్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం రంగాపురం గ్రామానికి చెందిన తెలుగు బాలస్వామి (53)అనే వ్యక్తి గురువారం రాత్రి పెబ్బేరు సంత ప్రదేశంలో టవల్‌తో చెట్టుకు ఉరివేసుకొని చనిపోయాడు. కాగా మృతుడికి ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు ఉండటం వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఓడీ రమేష్ తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన పరిమళ

**రాజోలి:** జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో పరిమళ (27)అనే మహిళ శుక్రవారం తెల్లవారు జామున ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆమె భర్త వెంకట్రాముడు, అతని బంధువుల వేధింపులు తట్టుకోలేక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వారి దర్యాప్తులో తేలింది. తన భర్తతో పాటు మరో ఆరుగురు బంధువులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈమెకు ఒక బిడ్డ, ఒక కొడుకు ఉన్నారు.

## పాము కాటుతో మహిళ మృతి

**దామరగిద్ద:** పాము కాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దామరగిద్ద మండలం ఉడ్మల్‌గిద్ద గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఉడ్మల్‌గిద్దకు చెందిన రాములు భార్య సరిత(22) అనే మహిళ రోజులాగే శుక్రవారం ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారు జామున పాము కాటు వేసింది. చికిత్స నిమిత్తం పేట ఏరియా ఆసుపత్రికి కుటుంబీకులు తరలించగా పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ సరిత మృతి చెందింది. కోయిల్‌కొండ మండలం కొండాపూర్‌కు చెందిన సరితతో ఉడ్మల్ గిద్దకు చెందిన రాములుకు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## 'సీఎం స్థాయి దిగజారి మాట్లాడుతున్నారు'

పెంట్లవెల్లి: ముఖ్య మంత్రి కేసీఆర్ స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి కురుమయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కమ్యూనిస్టుల చరిత్ర తెలుసుకొని మాట్లాడాలన్నారు. హామీలను అమలు చేయాలని పోరాడుతుంటే కమ్యూనిస్టులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నాయకులు బాలస్వామి, నాగరాజు, కురుమయ్య పాల్గొన్నారు.




వెంకటేశ్వర: గౌతంనంద
సత్యసాయి : ఫిదా

### కొల్లాపూర్ సమాచారం

| | |
|---|---|
| తహసీల్దార్ | 9000101488 |
| వ్యవసాయాధికారి: | 7288894354 |
| ఎంపీడీఓ: | 8008377455 |
| ట్రాన్స్‌కో ఏఈ: | 9440813494 |
| పంచాయతీ కమిషనర్ | 9951524815 |
| సీఐ: | 9440795725 |
| ఎస్ఐ: | 9440795711 |

### గ్యాస్ సమాచారం

భారత్ గ్యాస్: 08501- 275384

### మార్కెట్ ధరలు

| | |
|---|---|
| వేరుశెనగ | 5000 |
| కందులు | 5050 |
| వరి(1010రకం) | 1450 |
| మొక్కజొన్న | 1410 |

# అందని పశువైద్యం

- రోగాలతో మూగజీవాలు విలవిల
- నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్న రైతులు

కోడేరు: మండలంలో పశువైద్యం అందని ద్రాక్షగా మారింది. మండలంలో 90 శాతం ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారు. రైతులు ఆవులు, గేదెలు, గొర్రెలను పెంచుతూ పాడి పరిశ్రమతో లబ్ధి పొందుతున్నారు. మూగ జీవాలు వ్యాధుల బారిన పడితే పశు వైద్య కేంద్రాల్లో మూగజీవాలకు సరైన వైద్యం అందకపోవడంతో మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో మూగ జీవాలకు చిన్న వ్యాధి సోకినా నాటు వైద్యుని ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. గ్రామాల్లో ఉన్న పశు వైద్య కేంద్రాల్లో సరైన సిబ్బంది లేరు. ఆసుపత్రి భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొన్ని కేంద్రాల్లో చిన్న పాటి వర్షం కురిస్తే ఆసుపత్రిలో ఉన్న మందులు తడిసి ఉపయోగం లేకుండా పోతున్నాయి. మండల కేంద్రమైన కోడేరులో సొంత పశు వైద్య కేంద్రం లేకపోవడంతో పాత గ్రామ పంచాయతీ భవనంలో పశు వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని నార్లయిపల్లి, రాజాపూర్ తదితర గ్రామాల్లో పశు వైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి.


కోడేరు గ్రామ పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న పశువైద్య కేంద్రం

**సిబ్బందిని నియమించాలి**



పశు వైద్య కేంద్రాల్లో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నాం. పశువులకు వ్యాధి వస్తే వైద్య కేంద్రానికి తెస్తే వైద్యులేరని చెప్తున్నారు. వెంటనే నియమించాలి.

\- లింగయ్య

**ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి**



మండల కేంద్రంలో పశు వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో మూగ జీవులకు జబ్బు చేస్తే ప్రైవేట్ పశు వైద్య శాలలకు వెళ్తున్నాం.

\- వెంకటయ్య, కోడేరు

**మృతువాత పడుతున్నాయి**



రాజాపూర్‌లో రెగ్యులర్ పశువైద్యాధికారి లేకపోవడంతో పశువులు, గొర్రెలు జబ్బుబారినపడి మృత్యువాత పడుతున్నాయి. అధికారులు డాక్టర్‌ను నియమించాలి.

\- లక్ష్మయ్య, రాజాపూర్

## కొనసాగుతున్న ఎస్పీఎం కార్మికుల సమ్మె

కొల్లాపూర్ రూరల్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఎస్పీఎం కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీఎం నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్పీఎం కార్మికులను కూడా రెగ్యులర్ చేయాలన్నారు. 20 ఏండ్లకు పైబడి రెగ్యులర్ అవుతామనే ఆశతో పనిచేస్తున్నామనిపేర్కొన్నారు. ప్రభుత్వం తమపై కనికరం చూపి వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి సరైన హామీ వచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బాలరాజు, శివకుమార్, కురుమయ్య, వజీద్, అఖిల్, మహేష్, పాషా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకాన్ని చేపట్టాలి

పెంట్లవెల్లి: మండల పరిధిలోని సింగవరం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలకు కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కలతోనే మంచి వాతావరణం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పోలీసులు శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వరలక్ష్మి పూజ

కోడేరు: మండల కేంద్రమైన కోడేరుతోపాటు జనుంపల్లి, తీగలపల్లి, కొండ్రావుపల్లి, ఎత్తం తదితర గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు ఆయా ఆలయాల్లో వరలక్ష్మి వ్రతం చేశారు. అధికసంఖ్యలో ఆలయాల్లో పూజలు చేయడంతో కిట కిటలాడాయి. మహిళలు పూజలు నిర్వహించడం ద్వారా కోరిన కోరికలు తీరుతాయని శివాలయం అర్చకుడు శివయ్య తెలిపారు.

## కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

కోడేరు: వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌చేస్తూ కోడేరు బస్టాండ్‌లో నిర్వహిస్తున్న రిలే దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు మిద్దె కృష్ణయ్య, అధికార ప్రతినిధి కురుమయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఎస్సీ వర్గీకరణను అమలు చేసేవిధంగా చూడాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తాం అని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, చాన్న బాలస్వామి, రాజు, రామకృష్ణ, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం మండలాధ్యక్షుడిగా వెంకటస్వామి


వెంకటస్వామి గౌడ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

కొల్లాపూర్ రూరల్: మండల గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా కొల్లాపూర్ పట్టణానికి చెందిన వెంకటస్వామిగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహ ఆవరణలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ ముఖ్య అతిథిగా కొల్లాపూర్ గౌడ కులస్థుల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్థులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గౌడ కులస్థులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలని వారు కోరారు. ప్రభుత్వం ఈతచెట్లను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం గౌడ కులస్థులకు పెడరేషన్ ద్వారా లోన్ సౌకర్యం కల్పించాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి నెలకు మూడు వేల పించన్ సౌకర్యం కల్పించాలని కోరారు. వెంకటస్వామిగౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్థుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానన్నారు పెద్దకొత్తపల్లి మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో వెంకటస్వామిగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. గోవింద్‌గౌడ్, శేఖర్‌గౌడ్, సత్యనారాయణ గౌడ్, సోమన్ గౌడ్, పుల్లయ్య గౌడ్, శ్రీరాం గౌడ్ పాల్గొన్నారు.

## డీలర్ బందని రాజయ్య మృతి


రాజయ్య (ఫైల్)

కుడికిళ్ల( కొల్లాపూర్ రూరల్): మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామం లో రేషన్ డీలర్ రాజయ్య శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. రాజయ్య గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడేవాడు. శుక్రవారం పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు రాజయ్య కుమారుడు మురళి తెలిపారు. రాజయ్య మృతి పట్ల కొల్లాపూర్ మండల డీలర్లు, అధికారులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నాణ్యమైన విద్యనందించాలి

- కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్
- మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచన

పెద్దకొత్తపల్లి: కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అమరేందర్ రావు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను ఆయన పరిశీలన చేశారు. అనంతరం మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ అమరేందర్ రావు మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. అలాగే మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అధికారులు వేణుగోపాల్, తహసీల్దార్ బి.అశోక్ తదితరులు ఉన్నారు.

## కొల్లాపూర్‌లో సామూహిక వరలక్ష్మి వ్రతం

కొల్లాపూర్ రూరల్: అమ్మవారి కరుణ కోసం మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కొల్లాపూర్ మాధవ స్వామి ఆలయంలో మహిళలు సామూహిక వ్రతం నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను అలకరించి పురోహితులు వరలక్ష్మి వ్రత జపం పాటించగా మహిళ భక్తులు పల్లెంలో పచ్చని కొబ్బరి కాయ పెట్టి పసుపు కుంకుమలతో పాటు పూలతో అలంకరించారు. అనంతరం కొబ్బరి కాయకు మంగళ సూత్రాలు పెట్టి వాటిపై పసుపు కుంకుమ, పూలు చల్లుతూ అమ్మవారి మంత్ర జపంను పాటించారు. వరలక్ష్మి వ్రతం చేయడం మూలంగా మాంగళ్య బంధం గట్టి పడటమే కాక అమ్మ వారి చల్లని చూపు ఆ కుటుంబాలపై ఉంటుందని ఆలయ పూజారి వివరించారు.

## చెట్లే జీవనాధారం

పెద్దకొత్తపల్లి: సామాజంలో మనవ మనుగడకు చెట్లే జీవనాధారం అని యంపిపి వెంకటేశ్వరావు, ఎస్ఐ వెంకటరమణ అన్నారు. శుక్రవారం హరితహారంలో భాగంగా మండల పరిధిలోని చంద్రకల్ గ్రామంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి పెద్ద చేస్తే అవి మనను కాపాడుతాయన్నారు. చెట్టు వాతావరణ కాలుష్యంను నివారిస్తాయన్నారు. చెట్లను పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, పోలీసు సిబ్బంది చాంద్ బాష, ఉశన్న, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా బోషన్న, లక్ష్మన్ నాయక్, అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యాక్షులుగా వెంకటయ్య, సురేందర్, రాజు, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, కార్యదర్శులుగా లక్ష్మయ్య, పెద్దపుల్లయ్య, సుదర్శన్ , సింగోటి, మహిళా కార్యదర్శిగా జ్యోతి, కోశాధికారిగా గువ్వల అంజలయ్యలతో పాటు 25 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## చెరువు పూడికతో లాభాలు

పెంట్లవెల్లి: చెరువుల పూడికవల్ల అనేక ప్రయోజనాలున్నాయని ఎంపీపీ నిరంజన్ రావు, జడ్పీటీసీ హన్మంత్ నాయక్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక ఊర చెరువు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చెరువుల్లో పూడిక తీయడంతో ఏడాదికి రెండు పంటలను పండించుకునేందుకు రైతులకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి.ఎక్బాల్, మంత్రి జూపల్లి వ్యక్తిగత కార్యదర్శి రామరావు, సింగిల్ విండో చైర్మన్ రఘుపతిరావు, సర్పంచ్ కోట్ల సురేంద ర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజేష్, వైస్ ఎంపీపీ బత్తిని రాధ, ఎంపీటీసీ మహేశ్వరమ్మ, రామాపూరం సర్పంచ్ బాలరాజు, బత్తిని రాజు, ఎర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులతో చెలగాటం

కొల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతూరి ధర్మతేజ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడితే అందరికీ ఉద్యోగ అవకాశాలు వస్తాయనే ఆశలతో ప్రాణ త్యాగాలు చేసి తెలంగాణ సాధించుకుంటే మూడేళ్ల గడుస్తున్నా ఇప్పటి వరకు ఉద్యోగ అవకాశాలు లభించక నిరుద్యోగులు మనోవేదనకు గురివుతున్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.సమావేశంలో ఏఐఎస్ఎఫ్ తాలూకా కార్యదర్శి సతీష్‌కుమార్, జిల్లా నాయకులు శ్రీనివాసులు, మహేష్, శేఖర్, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

## సద్దుమనిగిన చేపల చెరువు వివాదం


ఇరు గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్ఐ

పెంట్లవెల్లి: చేపల చెరువు స్వాధీనంపై ఇరు గ్రామాల మధ్య చెలరేగిన ఘర్షణ అధికారుల చొరవతో సద్దు మనిగింది. మండల పరిధిలోని సింగవరం వీపన గండ్ల మండలం సంపట్రావు పల్లి గ్రామాల మధ్య ఉన్న చేపల చెరువు స్వాధీనం పై శుక్రవారం గామస్థులు గొడవ పడుతుంటే సమాచారం తెలుసుకున్న ఇరు మండలాల అధికారులు సంఘటన స్థలాన్ని చేరుకొని ఇరు గ్రామస్థులతో చర్చించారు. ఇరు గ్రామాల వారు చెరువులో పట్టుకోవాలని సూచించారు. పెంట్లవెల్లి తహసీల్దార్ వెంకటరమణ త్వరలోనే సర్వే చేయించి హద్దు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దీంతో ఇరు గ్రామాల ప్రజలు శాంతించడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

| | |
|---|---|
| స్టాఫ్ రిపోర్టర్ | 998541 1502 |
| పీసీ ఇన్‌చార్జి | 998541 0921 |
| వైద్యవిభాగం | 95739 56521 |
| వ్యవసాయం | 98663 96565 |
| వనపర్తిక్రైం | 89855 34383 |
| పురపాలకం | 94410 24635 |
| గోపాల్‌పేట | 9440766142 |
| ఖిల్లాఘనపురం | 9704455456 |

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నిర్మించొద్దు



నిరంజన్‌రెడ్డిని కలిసిన క్రీడాకారులు

**వనపర్తి విద్యావిభాగం:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే క్యాంపు ఏర్పాటు చేయవద్దని క్రీడాకారులు తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డికి క్రీడాకారులు శుక్రవారం రాజీవ్ చౌరస్తాలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు గట్టుస్వామి, షబ్బీర్, రమేష్, వెంకట్రాం, ఆదిత్య, మహేంద్రవర్మలు మాట్లాడుతూ ప్రభుత్వం బాలుర కళాశాల ప్రాంగణంలో రాజకీయ నాయకులకు సంబంధించినవి కాకుండా విద్యార్థులకు, క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా ఉండేవి నిర్మించాలని పేర్కొన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం

● ఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిన్నమ్మథామస్

**ఖిల్లాఘనపురం:** గ్రామంలో సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయమని ఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిన్నమ్మథామస్ అన్నారు. శుక్రవారం మండలంలోని షాపూర్ గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరు చదువు నేర్చుకోవాలని, గ్రామంలోని నిరక్షరాస్యులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సాక్షర భారత్ కోఆర్డినేటర్ నెహ్రూనాయక్, వీసీవోలు మల్లేష్, సోషల్ మొబలైజర్ జ్యోతి, లక్ష్మి, అరుణ, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి

**ఖిల్లాఘనపురం:** ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు అభివృద్ధి చెందుతారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుడిసె శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో 9వరోజు రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, యాదయ్య, కిశోర్, రాఘవేందర్, రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎంపిక

**వనపర్తి వైద్య విభాగం:** జిల్లా వైద్యారోగ్య శాఖ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ ఫోరం నూతన కార్యవర్గాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా రవీందర్, కార్యదర్శిగా ఎండీ. నూస్రత్‌అలీ, ట్రెజరీగా రవి, మహిళా కార్యదర్శిగా జ్యోతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, ఏడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం దిష్టిబొమ్మ దహనం

**వనపర్తి టౌన్:** ప్రజలు, ప్రతిపక్షాలు, పత్రికలను లెక్క చేయని పాలకులందరు కాలగర్భంలో కలిసిపోయారని, సీఎం కేసీఆర్‌కు అదే గతిపడుతుందని టీమాస్ ఫోరం జిల్లా నాయకుడు ఎండీ జబ్బార్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీ మాస్ ఫోర్ జిల్లా నాయకులు పుట్ట ఆంజనేయులు, మండ్లరాజు, బాల్‌రెడ్డి, నాగరాజు, గోపాలకృష్ణ, మహేష్, కళ్యాణ్,వేణుగోపాల్, సయాజ్,బాలస్వామి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## తండాను షాపూర్‌లోనే కొనసాగించాలి

**ఖిల్లాఘనపురం:** ఊరంచుతండాను షాపూర్ గ్రామపంచాయతీలోనే కొనసాగించాలని షాపూర్ ఉపసర్పంచు, ఊరంచు తండా వాసులు శుక్రవారం ఎంపీడీవో రెడ్డయ్యకు వినతిపత్రం అందజేశారు. 500 పైచిలుకు జనాభా గల తండాలను రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. కాగా ఊరంచుతండా షాపూర్ గ్రామానికి 0.5 కిలోమీటర్ల దూరంలోనే ఉందని, ఈ తండా 4.5 కిలోమీటర్లు ఉన్న ఆముదంబండ తండాలో కలపడమేంటని ప్రభుత్వ నిబంధనల ప్రకారం 3 కిలోమీటర్ల లోపు ఉన్న వాటిని గ్రామపంచాయతీకి అనుసంధానం చేస్తే బాగుంటుందని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో షాపూర్ ఉపసర్పంచు సోమ్లానాయక్, తండావాసులు లాలునాయక్, పాండు, శివప్రసాద్, నరేష్, రెడ్యా, సాలి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలు ఏవి..?

● ఇళ్లలోని వృథా నీరు రోడ్లపైకి
● ప్రధాన రోడ్డు పై ప్రతి నిత్యం మురుగునీరు
● కాలువలు నిర్మించాలంటున్న గ్రామస్థులు

**వనపర్తి రూరల్:** వనపర్తి మండలం చందాపురం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. గతంలో గ్రామంలో ఒకటి, రెండు చోట్ల తప్పా ఎక్కడ డ్రైనేజీలు ఉండేవి కావు. ప్రస్తుతం కొన్ని చోట్ల డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. అయినా ప్రధాన రోడ్డు వెంట డ్రైనేజీ నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే వృథా నీరు వీధి రోడ్డు, ప్రధాన రోడ్డు పై ప్రతినిత్యం పారుతున్నాయి. రోడ్ల పై నడవడానికి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. వాహనాలు రోడ్ల పై వెళ్తుంటే మురుగు నీరు చిట్లుతుందని, అలాగే ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి కింద పడిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి నీటికి దోమలు అధికమై రోగాలకు గురవుతున్నామని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు వస్తూపోతున్నా మురుగు కాలువలను నిర్మించడంలో శ్రద్ధ చూపించడం లేదని ఆరోపిస్తున్నారు. వర్షాకాలం కావడం వల్ల రోడ్లపై మరింత బురదమయంగా మారే అవకాశం ఉంది. కాలువలు నిర్మించి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రోడ్డు పై పారుతున్న మురుగు నీటి పై వెళ్తున్న ద్విచక్ర వాహనాలు

### మురుగు కాలువలు నిర్మించాలి



గ్రామంలో వెంటనే మురుగు కాలువలు నిర్మించాలి. రోడ్లపై మురుగు నీరు పారుతుండటం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. దోమలు అధికమై రోగాలు వస్తున్నాయి. మురుగు కాలువలు నిర్మించి ఇబ్బందులు తొలగించాలి.

● ఆవుల చంద్రశేఖర్, గ్రామస్థుడు

# విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే చిన్నారెడ్డి



విద్యార్థిని దీక్షితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిన్నారెడ్డి

**వనపర్తి వ్యవసాయం:** అగ్రికల్చర్ విద్యను అభ్యసించడానికి పరీక్ష రాసి ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని దీక్షితను ఎమ్మెల్యే జిల్లెల చిన్నారెడ్డి శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం వనపర్తి మండలం నాగవరం గ్రామంలోని ఆమె ఇంటికి వెళ్లి స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా పీజీలో ప్రవేశం కోసం జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో 650 మార్కులకు గాను 438.4 మార్కులు సాధించడం వల్ల ఖాన్‌పూర్‌లోని జూనియర్ రీసర్చ్ ఫెలోషిప్ ఆహ్వానించిందని, ఒడిషా రాష్ట్రం అగ్రికల్చర్ పీజీకి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు విద్యార్థిని వెల్లడించారు. శాస్త్రవేత్త కావాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, తిరుపతయ్య, నాగన్న, ఆశన్న, వేణు, ప్రభాకర్‌రెడ్డి, వార్డు సభ్యుడు మధుగౌడ్‌తో పాటు నాగవరం ఉప సర్పంచు మధుసుదన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై విద్యార్థినులకు అవగాహన

**వనపర్తి:** అగ్నిప్రమాదాలు - నివారణ గురించి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపకశాఖ అధికారి రంజిత్ రెడ్డి తన సిబ్బందితో సహా వచ్చి ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, నివారణ మార్గాల గురించి చక్కటి ప్రదర్శనలతో చూపించారు. వంటగ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకేజీ అవుతూ రెగ్యులేటర్ వద్ద మంటలు చెలరేగినపుడు నీళ్లల్లో తడిపిన దుప్పటిని ఒక్కసారిగా సిలిండర్‌పై మూసి మంటలను ఆర్పి వేసే విధానాన్ని, మంటల్లో గాయపడిన వారిని ఎలా బయటికి తరలించాలి అన్న పద్ధతులను ప్రదర్శించి చూపారు. అంతకు ముందు ఫైర్ ఎస్సై రంజిత్ రెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు నాలుగు రకాలుగా ఉంటాయని, అయితే చాలా వరకు మానవ తప్పిదం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాలపై అవగాహన చేసుకోవాలని, చిన్న చిన్న ప్రమాదాలు ఏర్పడినపుడు మన ఇళ్లల్లో ఉండే వస్తువులతో ఎలా అదుపు చేయవచ్చో వివరించారు. ప్రగతి ప్రత్యేక అధికారి సీపీవో రవిందర్‌రెడ్డి కళాశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా నీటి సమస్య ఉందని ప్రిన్సిపాల్ ఆయన దృష్టికి తేవడంతో ప్రతి రోజూ మున్సిపల్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రంజిత్‌రెడ్డి

## ఏఎన్‌ఎంపై పోలీసుల దాడికి ఖండన

**వనపర్తిటౌన్:** తమ వేతనాలు పెంచాలని కోరుతూ ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న యూరోపియన్ ఏఎన్‌ఎంలపై పోలీసులు దాడి చేయడాన్ని తెలంగాణ మెడికల్, పబ్లిక్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాపర్లవెంకటయ్య, చెన్నకేశవులు మాట్లాడుతూ యూరోపియన్ ఏఎన్‌ఎంపై దాడిని ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన పోలీసులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని, ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సినిమా గైడ్




| | |
|---|---|
| బృందావన్ | : డీజే |
| శ్రీరామ | : గౌతమ్‌నంద |
| శ్రీనివాస | : ఫిదా |
| శ్రీవెంకటేశ్వర | : నక్షత్రం |
| శ్రీరంగ | : ఇదేమిదెయ్యం |

## వనపర్తిలో కూరగాయల ధరలు

| | | | |
|---|---|---|---|
| టమాట | 50 | పచ్చిమిర్చి | 50 |
| కాకరకాయ | 40 | ఉల్లిగడ్డ | 12 |
| ఆలుగడ్డ | 20 | బెండకాయ | 40 |
| క్యారెట్ | 80 | క్యాబేజీ | 20 |
| బీన్స్ | 80 | బీరకాయ | 40 |
| బీట్‌రూట్ | 60 | క్యాప్సికం | 60 |
| చెవులకాయ | 40 | దొండకాయ | 30 |
| వంకాయ | 20 | క్యాలీఫ్లవర్ | 60 |

## వనపర్తి గ్యాస్ సమాచారం

| | |
|---|---|
| వెంకటేశ్వర | 94401 56789 |
| సాయి గాయత్రి | 08545-232235 |
| శ్రీబాలాజీ భారత్ | 08545-230024 |

## వనపర్తి మండలం

| | |
|---|---|
| తహసీల్దార్ | - 9000101531 |
| ఎంపీడీవో | - 8008901099 |
| వ్యవసాయాధికారి | - 7288894325 |
| ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ | - 9100121978 |
| పీఆర్‌ఏఈ | - 9052818476 |
| ఐబీ ఏఈ | - 9701375942 |
| పశువైద్యాధికారి | - 7702771430 |
| ఎస్సై | - 9440904757 |
| ఏపీవో | - 7095505100 |
| ఏపీఎం | - 8790990879 |
| ఎంఈవో | - 9550414427 |

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● ఈఓం. రవికుమార్, పంచాయతీ కార్యదర్శి



**ఖిల్లాఘనపురం:** పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పర్వతాపురం పంచాయతీ కార్యదర్శి ఈఎం. రవికుమార్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

**పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?**

గ్రామంలో చెత్త చెదారం చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను ఇద్దరు మనుషులతో శుభ్ర పరుస్తున్నాం. గుంతలలో మురుగు నీరు చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

**డంపింగ్ యార్డు పూర్తయ్యిందా...? చెత్త ఎక్కడ వేస్తున్నారు...?**

డంపింగ్ యార్డు పూర్తియ్యింది. నిర్మించిన డంపింగ్ యార్డులోనే చెత్త వేయాలని సర్పంచుకు తెలిపాం. ఇప్పటి నుంచి రెగ్యూలర్‌గా డంపింగ్ యార్డులోనే చెత్త వేసేలా చర్యలు తీసుకుంటాం.

**గ్రామంలో తాగునీటి సమస్య ఉందా..?**

ఇప్పటి వరకు గ్రామంలో తాగునీటికి సమస్య రాలేదు. కాకపోతే ఎస్సీ కాలనీ వాసులకు తక్కువగా నీరు వెళ్తుంది. పైపులైన్ సరిచేసి పుష్కలంగా నీరందిస్తాం.

**హరితహారంలో భాగంగా గ్రామంలో ఎన్ని మొక్కలు నాటారు...?**

హరితహారంలో భాగంగా గ్రామంలో 12 వేల 570 గుంతలు తీశాం. ఇప్పటి వరకు 7070 టేకు, 700ల దానిమ్మ చెట్లునాటాం. ఇంకా కొనసాగుతున్నాయి.



బుట్టలలో ఏపుగా పెరిగిన గోధుమ మొలకలు (ఫైల్)

గిరిజనం పండుగ ఇది.. తొమ్మిది రోజుల పర్వదినం ఇది.. డప్పుల మోతలు, పాటలు, నృత్యాలతో తండాలు మారుమోగే సందర్భమిది... కన్నె పిల్లల పండుగ ఇది.. పంటలను కాపాడే దేవతకు ప్రత్యేక అర్చన ఇది.. ఇదే గిరిజనులు ఉత్సాహంగా జరుపుకొనే తీజ్ పర్వదినం. ఏటా శ్రావణమాసంలో నిర్వహించుకొనే ఈ వేడుకలకు రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ గుర్తింపు దక్కింది. యువతులతో పాటు తండాలోని వారందరూ ఉమ్మడిగా చేసుకొనే ఈ పండుగపై ప్రత్యేక కథనం...

# తండాల్లో.. గిరిజనోత్సవం

- కన్నెపిల్లల కలల పండుగ తీజ్
- బంజారాల సంప్రదాయ వేడుక
- శ్రావణంలో ధూంధాంగా తొమ్మిది రోజులు
- తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ గుర్తింపు

**అచ్చంపేట** : గిరిజనులు అత్యంత వైభవంగా జరుపుకొనే పండుగల్లో తీజ్ (మొలకల పండుగ) ప్రధానమైనది. ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, మారెమ్మ దేవతలకు శ్రావణమాసంలో నిర్వహించే బోనాల ఉత్సవాల మాదరిగానే, గిరిజనులు తీజ్ పండగను ఉత్సాహంగా జరుపుకుంటారు. మెరామ్మ, తీజ్, మత్రాల్, సీత్ల తదితర దేవాతలను పూజిస్తూ పండుగలు జరుపుకుంటారు. మెరామ్మ తండాలను రక్షిస్తే, తీజ్ దేవత పంటలను కాపాడుతుందని గిరిజనుల విశ్వాసం. సీత్ల పశు సంపదను వృద్ధి చేస్తుందని, మత్రాల్ పిల్లలకు రోగాలు రాకుండా కాపాడుతుందని వారి నమ్మకం.

## తీజ్ వేడుకల్లో తొలి అంకం

ఈ వేడుకల నిర్వహణకు ముందు గిరిజనులందరూ సమావేశమవుతారు. వేడుకలకు నాయకుడిగా తండాలోని ఓ పెద్ద మనిషిని ఎన్నుకుంటారు. ఆయనతో పాటు కారోబార్, దావులను నియమించుకుంటారు. పండగ ముగిసే వరకు ఆ ముగ్గురి ఆదేశానుసారం తండా వాసులంతా నడుచుకుంటారు. ఆ తర్వాత యువతులు ప్రతి ఇంటి నుంచి బియ్యాన్ని సేకరించి తాము ఎన్నుకున్న నాయకుడికి అప్పగిస్తారు. ఆయన ఆ బియ్యాన్ని విక్రయించి వచ్చిన డబ్బుతో గోధుమలు, శనగలు కొనుగోలు చేసి తీసుకువస్తాడు.

## తండాను కాపాడే దండి మేరమ్మ

దండి మేరమ్మ తండాను రక్షిస్తుందని గిరిజనుల విశ్వాసం. పందిరి వద్ద పేడతో అలికి ముగ్గు వేస్తారు. ఒక ఇత్తడి చెంబును పసుపుతో అలంకరించి, అందులో నీళ్ల పోసి ముగ్గుపై ఉంచుతారు. అందులో వేపకొమ్మలను పెడతారు. దాని ముందు వెండి కడియాలు, దండెలు వంటి ఆభరణాలను పెట్టి మేరమ్మను ప్రతిష్ఠిస్తారు. ఆమెకు నైవేద్యంగా మేకపోతును బలి ఇస్తారు. మేక శరీరంలో నుంచి ఒక ఎముక, కాలేయంను అమ్మవారికి ప్రసాదంగా సమర్పిస్తారు. తర్వాత ఆ మాంసాన్ని తండాలోని అన్ని కుటుంబాలకు పంపిణీ చేస్తారు.

## పెళ్లికాని యువతులే పూజారులు

ఈ పండుగకు పెళ్లి కాని యువతులే పూజారులుగా వ్యవహరిస్తారు. బుట్టలలో పోసిన గోధుమ గింజలు మొలకెత్తి నారుగా మారే వరకు వారే పూజలు నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు వారు అక్కడే ఉండి ఉపవాస దీక్ష చేస్తారు. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళలో తండాకు సమీపంలోని బావి నుంచి నీటిని తీసుకువచ్చి మొలకల బుట్టలకు పోస్తారు. ఆ తర్వాత పచ్చకూర, రొట్టెలు మాత్రమే తిని అక్కడే నిద్రపోతారు. పెళ్లి కాని గిరిజన యువకుడిని వారికి సహాయకుడిగా ఉంచుతారు.



తీజ్ పందిరి వద్ద సంప్రదాయ నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు (ఫైల్)

## 8వ రోజు గన గోర్‌లకు ప్రత్యేక పూజలు

పందిరిని ఏర్పాటు చేసిన ఎనిమిదవ రోజు నాయకుడి అనుమతితో గిరిజన యువతులంతా కలిసి సమీపంలోని చెరువు వద్దకు వెళ్తారు. నల్లరేగడి మట్టిని తీసుకొని తండాలోని అనుభవజ్ఞుడి సమక్షంలో ఒక ఆడ, మగ బొమ్మలను తయారు చేయిస్తారు. ఆడ బొమ్మను గిరిజన సంప్రదాయ వస్త్రాలతో అలంకరిస్తారు. మగ బొమ్మకు మగవారి దుస్తులను వేస్తారు. ఈ బొమ్మలను గన్, గోర్ అని పిలుస్తారు. గన్ అంటే మేరామ, గోర్ అంటే సేవాభాయి అని భావన.

## తొమ్మిదో రోజు చివరి ఘట్టం

తొమ్మిదో రోజు సాయంత్రం తీజ్ బుట్టలకు పూజలు చేస్తారు. యువతులు, మహిళలు బుట్టలను తలపై పెట్టుకొని తండా సమీపంలోని నీటి ప్రవాహం వద్దకు వెళతారు. అక్కడ తుది పూజలు నిర్వహించి ఆ బుట్టలను నీటిలో వదిలిపెడతారు. ఇంటి నుంచి తీసుకెళ్లిన పచ్చకూర, రొట్టెలను అక్కడే భుజిస్తారు. పూజారులుగా వ్యవహరించిన యువతులు ఇంటికొచ్చాక సోదరులు వారిని పీటలపై కూర్చోబెట్టి కాళ్లకు నమస్కరిస్తారు. తర్వాత తీజ్ పందిరి ఎదురుగా ఏర్పాటు చేసిన ఊయలను అందరూ కలిసి తొలగిస్తారు. దీంతో తీజ్ పండగ ముగుస్తుంది.



గ్రామపెద్దలకు తీజ్ మొలకల రుమాలులో పెడుతున్న గిరిజన యువతులు

## దుస్సరి తీగలతో బుట్టల తయారీ

నాయకుడు తెచ్చిన గోధుమలను యువతులు, మహిళలు పెద్దల సమక్షంలో పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ ఒక ఇత్తడి బిందెలో పోసి నాన బెడతారు. అనంతరం పొలాల్లో దొరికే దుస్సెరి తీగలను తీసుకొచ్చి చిన్న చిన్న బుట్టలను అల్లుతారు. మరుసటి రోజు సాయంత్రం తాము తయారు చేసిన బుట్టలను తీసుకొని డప్పుల మోతల నడుమ నృత్యం చేసుకుంటూ ఊరేగింపుగా వెళ్లి పుట్టమట్టి తీసుకొస్తారు. వెళ్లే దారిలో నానబెట్టిన శనగలను యువతులు రేగు ముళ్లకు కుచ్చేందుకు యత్నిస్తారు. యువకులు వారిని అడ్డుకుంటూ ఉంటారు. ఇలా ఆట పాటల నడుమ ఊరేగింపు కొనసాగుతుంది. చివరగా పుట్టమట్టిని తెచ్చి బుట్టల్లో నింపు నానబెట్టిన గోధుమలను నాటుతారు. తండా మధ్యన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరిపై బుట్టలను ఉంచుతారు. దాని ఎదురుగా ఊయలలను ఏర్పాటు చేస్తారు.

## దేవత బుట్టను దాచి పెడతారు

తీజ్ పందిరిపై ఒక ప్రత్యేకమైన చిన్న బుట్ట ఉంటుంది. దానిని 'చెడ్‌పల్లికుళ్ళిని' అని పిలుస్తారు. యువతులకు సహాయంగా ఉన్న యువకుడు ఎనిమిదవ రోజు ఆ దేవత బుట్టని ఎవరికీ తెలియకుండా తీసుకెళ్లి దాచి పెడతారు. ప్రతి రోజూ బుట్టలకు పూజలు చేస్తున్న యువతులు ఆ బుట్టను తిరిగివ్వాలని అతడిని బతిమిలాడతారు. అప్పుడతను తీజ్ తల్లిదండ్రుల పేర్లు చెప్పాలని, అప్పుడే తానా బుట్టను ఇస్తానని చెప్తాడు. తీజ్ దేవత తల్లి మహాలక్ష్మమ్మ, తండ్రి సేవాలాల్ మహరాజ్ అని యువతులు సమాధానం ఇస్తారు. దీంతో అతడి తాను దాచిపెట్టిన బుట్టను ఇచ్చేస్తాడు. వారా బుట్టను తిరిగి పందిరిపై ఉంచుతారు. అనంతరం పందిరిపై నుంచి బుట్టలను దించుతారు. ఆ రోజంతా ఊయల ఊగుతూ మహిళలు, యువతులు సరదాగా గడుపుతారు. డప్పుల మోతలు, పాటలు, నృత్యాలతో తండాలు మారుమోగుతాయి. సాయంత్రం మొలకల నుంచి తీజ్‌ను తీసి నాయకుడి రుమాలులో పెడతారు. నాయకుడితో పాటూ తండాలోని వారందరినీ ఒక చోట కూర్చోబెట్టి తీజ్ బుట్టలకు పూజలు చేస్తారు. గిరిజన యువతులు మొలకలను తీసి వారి రుమాలులో, చెవుల మధ్యన ఉంచుతారు. తొమ్మిది రోజుల పాటు తమ పూజలందుకున్న తీజ్ తమను వదిలి పెట్టి వెళ్లిపోతుందంటూ బాధతో దుఃఖిస్తారు.

# సౌదీ నుంచి 23 రోజులకే పల్లెగడ్డకు శవం

- తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ విశేష కృషి



మల్లయ్య (ఫైల్)

నారాయణపేట: సౌదీ అరేబియాలో గుండెపోటుతో మరణించిన కోస్గిమండలం పోలేపల్లి పల్లెగడ్డ గ్రామానికి చెందిన తడకలి మల్లయ్య(40) మృతదేహం ఈనెల 3న స్వగ్రామానికి చేర్పించడంలో తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు నందిదేవేందర్‌రెడ్డి విశేష కృషి చేశారని చెప్పవచ్చు. 2014లో సౌదీలోని దుమ్మామ్‌కు జీవనోపాదికి వెళ్ళిన మల్లయ్య సెలవుపై వచ్చి తిరిగి సౌదీకి వెళ్ళాడు. గతనెల జూలై 13న మల్లయ్య మృతిచెందినట్లు తోటి కూలీలు ఫోన్ ద్వారా భార్య శ్యామలమ్మకు సమాచారమిచ్చారు. 14న జిల్లాకలెక్టర్ రొనాల్డ్‌రోస్‌కు తన భర్త ఆచూకి తెలిపి తమ వద్దకు చేరేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించింది. ఆంధ్రజ్యోతిలో ప్రముఖంగా ప్రచురించిన కథనంతో తెలంగాణ గల్ఫ్ అసోషియేషన్ వర్కర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు నంగి దేవేందర్‌రెడ్డి గల్ఫ్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి శవాన్ని రప్పించేలా చర్యలు తీసుకున్నారు. మృతుడికి భార్యతో పాటు పదోతరగతి చదువుతున్న భ్రమరాంభిక, 8వ తరగతి చదువుతున్న మహేశ్వరి, మూడో తరగతి చదువుతున్న గణేష్‌లు సంతానం ఉన్నారు. మృత దేహాన్ని సౌదీనుంచి ఇండియాకు త్వరగా పంపాలని నంగి దేవేందర్‌రెడ్డి మధద్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇండియన్ ఎంబాసికి, భారత విదేశాంగ దృష్టికి తీసుకువెళ్ళారు. తెలంగాణ ఎన్ఆర్ఐ మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఈమేయిల్ ద్వారా పంపించారు. ఎట్టకేలకు 23రోజుల తర్వాత శవం ఇండియాకు చేరింది. శవపేటిక రవాణాకు హైదరాబాద్ ఏయిర్‌పోర్ట్‌నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం పల్లెగడ్డ వరకు తెలంగాణ ఎన్ఆర్ఐ విభాగం వారు ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించారు.

## రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈమూడేళ్లలో గల్ఫ్‌దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రవాసీ కార్మికులు వివిధ కారణాలతో 600ల మందికి పైగా చనిపోయారని శంషాబాద్, హైదరాబాద్ ఏయిర్‌పోర్ట్‌లోని డెత్ రిజిస్టర్‌లో నమోదయియ్యాయని తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు నంగి దేవేందర్‌రెడ్డి తెలిపారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు, మృతధన సహాయం చెల్లించాలని 2008లో ఉద్యమనాయకుడిగా కేసీఆర్ అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారన్నారు. కానీ అధికారంలోని వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఆమలు చేయడం లేదని విమర్శించారు. విదేశీ మారక ద్రవ్యాన్ని అర్జిస్తూ దేశ ప్రగతికి పాటుపడుతున్న గల్ఫ్ కార్మికులు చనిపోయిన సందర్భాల్లో వారిని ఆదుకోవడం ప్రభుత్వాల బాధ్యతఅని దేవేందర్‌రెడ్డి అన్నారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందుల్లో ఉన్నవారు సలహాలు, సహాయం కోసం తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోషియేషన్ హెల్ప్‌లైన్ నెంబర్ 814 358 8886కు సంప్రదించాలన్నారు. సౌదీనుంచి నెలల తరబడి శవాల తరలింపు సమయం పడుతున్న నేపథ్యంలో 23రోజులకే మల్లయ్య శవం పల్లెగడ్డకు తరలించడంలో దేవేందర్ రెడ్డి కృషి ఎంతో ఉంది.


ధన్వాడలో..


వనపర్తిలో..




గద్వాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు

## వరాలిచ్చే కల్పతరువు

# మహాలక్ష్మి




కల్వకుర్తి : కన్యకాపరమేశ్వరి దేవాలయంలో..


కొల్లాపూర్: మాధవ స్వామి ఆలయంలో ..


నాగర్‌కర్నూల్ అయ్యప్పస్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు


జడ్చర్లలోని శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో


అయిజలో..

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతం చేసుకున్నారు. భర్త, పిల్లాపాపల్ని చల్లగా చూడు తల్లీ అంటూ, సుఖ సంపదలు ఇవ్వుతల్లి అంటూ వేడుకున్నారు. ముత్తయిదువులందరూ కలిసి పూజ చేసి, వాళ్లనే వరలక్ష్మి అమ్మవారిగా భావిస్తూ వాయనం సమర్పించుకుని, దీవెనలందుకున్నారు. వాయనం ఇస్తున్నవారు 'ఇచ్చుకుంటినమ్మ వాయనం' అంటూ ఉంటే, పుచ్చుకున్నవారు 'పుచ్చుకుంటినమ్మ వాయనం' అంటూ దీవించారు. అనంతరం అమ్మవారికి ఇష్టమైన ప్రసాదాలు ధూప దీప నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.



ఊట్కూర్ శిశు మందిర్‌లో ..


మహబూబ్‌నగర్‌లో సామూహిక వ్రతాలు


అచ్చంపేట: సరస్వతీ శిశు మందిర్‌లో సామూహిక వ్రతాలు


భూత్పూర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో..

## దారి కనుక్కోండి



## సూక్తి

కోపం తెచ్చుకునే హక్కు ఎవరికైనా ఉండొచ్చు..
కానీ ఆ కోపంలో క్రూరంగా ప్రవర్తించే హక్కు మాత్రం ఎవరికీ లేదు.

## టంగ్ ట్విస్టర్స్



1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Sounding by sound is a sound method of sounding sounds.
3. Real rock wall, real rock wall, real rock wall



'పోలార్ పార్క్'లోకి అడుగుపెట్టగానే.. ముఖ్య అతిథిపై పూల వర్షం కురిపించినట్లు...వెన్నెల్లాంటి మంచు జల్లులా కురుస్తుంది. చాలా రోజుల తర్వాత కలిసినా ఆత్మీయుల్లా క్రూర మృగాలు ఆలింగనం చేసుకుంటాయి. ఎంతో ప్రేమతో ముద్దిస్తాయి. స్నేహితుల్లా కలిసిపోతాయి. వాటిని వదిలిపోతుంటే. దీనంగా చూస్తుంటాయి.. ఈ పార్కుకు మీకు వెళ్లాలనుందా? అయితే చలో నార్వే!



# ప్రేమతో ముద్దిచ్చే తోడేళ్లు

పోలార్ పార్కు దీన్నే 'పోలార్ జూ'గా కూడా పిలుస్తారు. ఇది 'ట్రోమ్స్' అనే చిన్న దేశంలో ఉంది. నార్వేలోని ప్రసిద్ధ పార్కుగా పేరు పొందింది. ఈ పార్కును 1994, జూన్ 18న ప్రారంభించారు. ఎలుగు బంట్లు, నక్కలు, తోడేళ్లు, పెద్ద అడవి పిల్లి(శివంగి), ధ్రువపు జింకలు, మూస్(లేడి వంటి జంతువు), ఎరుపు జింక, బ్రౌన్ ఎలుగుబంటి జంతువులు ఈ పార్కులో స్వేచ్ఛగా తిరుగాడుతుంటాయి. 112 ఎకరాల్లో ఉన్న ఈ పార్కుల్లో 'తోడేళ్ల క్యాంప్' ప్రత్యేక ఆకర్షణ. ఈ పార్కుకు 12 కిలోమీటర్ల దూరంలోనే 'రోహ్‌కున్ బొర్రి నేషనల్ పార్కు' ఉంది.

### సెల్ఫీలకు పోజులు!

